తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్
శుక్రవారం
09 అక్టోబర్ 2026
Follow :



జనంసాక్షి
## కథనాలతో
## కదిలిన పోలీసులు

చందానగర్ పరిధిలోని
లాడ్జీల్లో ముమ్మర తనిఖీలు
ప్రతి ఒక్కరి వివరాలపై ఆరా..
ప్రతిరోజూ తనిఖీలు కొనసాగుతాయని
పోలీసుల వెల్లడి

లోపలి పేజీలో..

# ఆహార భద్రతపై పటిష్ఠ చర్యలు

- అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి
- అర్హులందరికీ రేషన్ కార్డులు ఇవ్వాలి : ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, అక్టోబర్ 08 (జనంసాక్షి)

జాతీయ ఆహార భద్రత చట్టం--2013 అమలులో భాగంగా జిల్లాలో ఆహార భద్రత వ్యవస్థను మరింత పటిష్ఠంగా అమలు చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. రేషన్ కార్డుల జారీ, యూనిట్ల నమోదు, నిత్యావసర సరుకుల కేటాయింపు, పంపిణీ ప్రక్రియలను నిబంధనల మేరకు సజావుగా నిర్వహించాలని సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని వీసీ హాల్‌లో జిల్లా స్థాయి విజిలెన్స్ కమిటీ సమావేశం అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజా పంపిణీ వ్యవస్థ, రేషన్ సరుకుల సరఫరా, విద్యార్థుల సంక్షేమానికి సంబంధించిన అంశాలపై సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని 633 చౌక ధరల దుకాణాల ద్వారా 6,56,784 ఆహార భద్రత కార్డుల పరిధిలో 22,62,797 మంది లబ్దిదారులకు రేషన్ సరుకులు పంపిణీ చేస్తున్నట్లు జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారులు తెలిపారు. ప్రతి నెలా 13,905.216 మెట్రిక్ టన్నుల బియ్యం కేటాయిస్తున్నట్లు, ఏప్రిల్ 2025 నుంచి సన్నబియ్యం పంపిణీ కొనసాగుతున్నట్లు వివరించారు.
రేషన్ సరుకుల కేటాయింపు, రవాణా, పంపిణీలో ఎలాంటి జాప్యం లేకుండా చర్యలు చేపట్టాలని అదనపు కలెక్టర్ సూచించారు. హాస్టళ్లు, రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని, మెనూ



బోర్డులను ప్రదర్శించాలని ఆదేశించారు.

**రేషన్ సరఫరా మెరుగుపరచాలి : ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి**

మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ప్రత్యేక ఆహ్వానం మేరకు సమావేశానికి హాజరై వివిధ శాఖల పనితీరుపై సమీక్షించారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ రేషన్ కార్డులు అందించాలని, గోధుమలు కూడా పంపిణీ చేయాలని సూచించారు. రేషన్ బియ్యం, ఇతర నిత్యావసర సరుకులు నిర్ణీత సమయంలో చౌక ధరల దుకాణాలకు చేరేలా సరఫరా, రవాణా వ్యవస్థను పటిష్ఠం చేయాలని కోరారు. ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకం, అంగన్‌వాడీ సేవలు, బీసీ, ఎస్సీ సంక్షేమ హాస్టళ్ల నిర్వహణపై కూడా సమీక్ష నిర్వహించారు. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందిస్తూ, అవసరమైన వసతులను మెరుగుపరచాలని సూచించారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు ఝాన్సీరాణి, రేణుకాదేవి, వినోద్‌కుమార్, శారద, పద్మజ, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# ప్రజా సమస్యలు, పెండింగ్ పనులపై ఎమ్మెల్యే ఫోకస్

## నార్సింగిలో అభివృద్ధి పనులపై ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ సమీక్ష

**రాజేంద్రనగర్,అక్టోబర్8(జనంసాక్షి) :** నార్సింగి సర్కిల్‌లో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్ నార్సింగి సర్కిల్-45 కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ అమిత్ నారాయణతో కలిసి నిర్వహించిన సమావేశంలో పెండింగ్ అభివృద్ధి పనులు, మౌలిక వసతులు, ప్రజా సమస్యల పరిష్కారంపై చర్చించారు. ఈ సందర్భంగా విజయ సూపర్ మార్కెట్ నుంచి జనచైతన్యకు లింక్ రోడ్డు, ట్రైల్స్ ఎదురుగా ఉన్న ప్రాంతం నుంచి దర్గా హైటెన్షన్ లైన్ వరకు లింక్ రోడ్ల ఏర్పాటుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారు. పనులను త్వరితగతిన చేపట్టాలని అధికారులను ఎమ్మెల్యే ఆదేశించారు. ఈ సమావేశంలో డీసీ లక్ష్మారెడ్డి,ఏఎంసీలు, ఎఈ, డీఈ లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

**బుల్కాపూర్ నాలా పనులను పరిశీలన :** మణికొండ మున్సిపాలిటీ పరిధిలో సుమారు రూ.100 కోట్లతో చేపడుతున్న ఎస్ఎన్‌డిపి బుల్కాపూర్ నాలా అభివృద్ధి, నిర్మాణ పనులను రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్ గౌడ్, జోనల్ కమిషనర్ అమిత్ నారాయణ, డీసీ లక్ష్మారెడ్డి లతో కలిసి పరిశీలించారు.పనులను నాణ్యతా ప్రమాణాలతో త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అధికారులు, స్థానిక నాయకులు బి శ్రీరాములు, కె. రామకృష్ణారెడ్డి,ఆర్. శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.





**కోకాపేటలో వ్యర్థాల వేర్పాటుపై అవగాహన**

సర్కిల్-45 పరిధిలోని కోకాపేట్ వార్డు నం.125లో వ్యాపారస్తులకు తడి, పొడి, హానికర చెత్త వేర్పాటుపై సానిటేషన్ ఇన్స్పెక్టర్ లచ్చిరాం అవగాహన కల్పించారు. "నో బిన్--నో ట్రేడ్"లో భాగంగా ప్రతి వ్యాపార సంస్థలో తడి, పొడి చెత్తకు ప్రత్యేక బిన్నులు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. పరిసరాల పరిశుభ్రతకు మున్సిపల్ సిబ్బందికి సహకరించి, చెత్తను మూలస్థాయిలోనే వేరు చేసి అందించాలని కోరారు.

## గురుకుల మహిళ కళాశాలలో బతుకమ్మ వేడుకలు



**శామీర్ పేట్, అక్టోబర్ 8(జనం సాక్షి )**శామీర్ పేట్ లోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం రోజున ముందస్తు బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు . బతుకమ్మ పాటలు పాడుతూ లయబద్ధంగా చప్పట్లు చరుస్తూ విద్యార్థులు కళాశాల అధ్యాపక బృందం కళాశాల బతుకమ్మ ఆడారని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇష్రత్ తెలియజేశారు. తెలంగాణ పండగ అయినటువంటి బతుకమ్మ ఆడడం పట్ల ప్రిన్సిపల్ హర్షం వ్యక్తం చేశారు. బతుకమ్మ ఆటలో ఉన్న లయను బతుకమ్మ పాటలో ఉన్న గొప్పతనాన్ని కళాశాల కల్చరల్ కోఆర్డినేటర్ అయినా జి ధనవేణి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఇష్రత్,వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వి.స్రవంతి, అకాడమిక్ వైస్ ప్రిన్సిపల్ ఎం గీత, కల్చరల్ కోఆర్డినేటర్స్ జి ధనవేణి , మమత అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

## పాత కొడంగల్ తాండ--పర్సాపూర్ రోడ్డుకు డబుల్ కోటింగ్



**కొడంగల్, అక్టోబర్ 08 (జనం సాక్షి):** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు, కొడంగల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ తిరుపతిరెడ్డి సహకారంతో పాత కొడంగల్ తాండ నుంచి పర్సాపూర్ మెయిన్ రోడ్డు వరకు బీటీ రోడ్డుకు డబుల్ కోటింగ్ పనులు చేపట్టారు. జరుగుతున్న రోడ్డు పనులను మున్సిపల్ వైస్ చైర్మన్ శంకర్ నాయక్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హన్మ్యా నాయక్, రోడ్డు ఇంజనీర్ సత్తిబాబు ఉన్నారు.

## ప్రభుత్వ కుంటకు హైడ్రా కంచె

### ఆక్రమణలకు ఇక చెక్.. పోలీస్ బందోబస్తు మధ్య ఫెన్సింగ్

### మిగిలిన కుంట భూమినైనా కాపాడాలని స్థానికుల డిమాండ్




**అబ్దుల్లాపూర్‌మెట్, అక్టోబర్ 8 (జనం సాక్షి ):**కుంటలు, చెరువుల భూముల పరిరక్షణపై హైడ్రా చర్యలు ముమ్మరం చేసింది. నాగోల్ సర్కిల్--11 పరిధిలోని కుంట్లూర్ గ్రామంలోని బట్లునిబాయి కుంటను రక్షించేందుకు అధికారులు ఫెన్సింగ్ ఏర్పాటు చేస్తున్నారు. పోలీస్ బందోబస్తు మధ్య కుంట సరిహద్దులను గుర్తిస్తూ పనులు కొనసాగుతున్నాయి. కుంట్లూర్‌లోని సర్వే నంబర్ 24లో ఉన్న బట్లునిబాయి కుంటకు గతంలో మూడు ఎకరాలకు పైగా విస్తీర్ణం ఉన్నట్లు అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డులో పేర్కొన్నారు. కాలక్రమంలో ఆక్రమణలకు గురికావడంతో ప్రస్తుతం రెండు ఎకరాల పైచిలుకు మాత్రమే మిగిలినట్లు అధికారులు, స్థానికులు చెబుతున్నారు. మిగిలిన కుంట భూమి కూడా ఆక్రమణలకు గురికాకుండా హైడ్రా సరిహద్దులను స్పష్టంగా గుర్తించి కంచె ఏర్పాటు చేస్తోంది. కుంట భూమిలో ఆక్రమణలు, అక్రమ నిర్మాణాలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. హైడ్రా, రెవెన్యూ, మున్సిపల్ అధికారులు నిరంతరం పర్యవేక్షించి కుంట భూమికి శాశ్వత రక్షణ కల్పించాలని డిమాండ్ చేస్తున్నారు.

# మా భూమిని కబ్జా చేసి కాజెయ్యడానికే కుట్ర పన్నుతున్నారు

**శామీర్ పేట్, అక్టోబర్ 8(జనం సాక్షి )** మా పూర్వికుల నుంచి వచ్చిన ఆస్తిని కొందరు వ్యక్తులు కబ్జాచేసి కాజేసేందుకు కుట్ర పన్ను తున్నారని మా ఇంటి స్థలాన్ని కబ్జా కాకుండా అధికారులు చొరవ తీసుకుని మాకు న్యాయం చెయ్యాలని మూడుచింతలపల్లి మున్సిపల్ ఉద్దెమర్రి గ్రామానికి చెందిన భాస్కర కిషన్ రావు కుటుంబీకులు ఆరోపించారు. గురువారం శామీర్ పేట ప్రెస్ క్లబ్లో విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ..మూడుచింతలపల్లి మున్సిపాలిటీ ఉద్దెమర్రి గ్రామంలో మా తండ్రి కీర్తి శేషులు భాస్కర నరహరిరావు 1981 సంవత్సరంలో అప్పటి గ్రామ పంచాయతి ద్వారా ఇంటి అనుమతులు తీసు కుని ఇంటితో పాటు ప్రహరీగోడను నిర్మించు కున్నామని తెలిపారు. అప్పటి నుంచి ట్యాక్సు, విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నామని పేర్కొన్నారు. నైజాం కాలం నుంచి ఇట్టి భూమి మా ఆధీనంలో ఉందని చెప్పారు. ఇంటికి సంబందించిన డాక్యు మెంట్లు మా వద్ద ఉన్నాయని అనాటి సర్పంచ్ లక్ష్మన్ రావు ద్వారా తీసుకోవడం జరిగిందన్నారు. కాలక్రమేణ మా ఇల్లు శిధిలావస్థకు చేరుకోవడంతో కోతుల బెడదతో మా పాత ఇంటిని కూల్చివేశా మని పేర్కొన్నారు. మా కుటుంబ సభ్యులు ఇట్టి భూమిని పంచుకొని వేర్వేరుగా ఇంటి నెంబర్లు తీసుకోవడం జరిగిందని తెలిపారు. కొందరు వ్యక్తులు కక్షపూరితంగా




మా భూమిని కబ్జా చేసేందుకు కుట్రలు పన్నుతున్నారని ఆరో పించారు. గ్రామకంతం భూమిని ప్రభుత్వ భూమిగా చిత్రీకరిస్తు మమ్ములను కొందరు వ్యక్తులు తీవ్ర ఇబ్బందులకు, భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు . అధికారులు దృష్టి సారించి మాకు న్యాయం చేయ్యాలని మా ఇంటి స్థలాన్ని ఇతరులు కబ్జా చెయ్యకుండా కాపాడాలని అధికారులకు మొరపెట్టుకున్నారు. ఈ కార్యక్రమం లో భాస్కర నర్సింహారావు, భాస్కర రవీందర్ రావు, సీత రామారావులు పాల్గొన్నారు

# హకీంపేటలో ఎక్స్‌పోవేదిక స్థలాన్ని పరిశీలించిన జిల్లా కలెక్టర్ దీపక్ తివారి

### పారిశ్రామికవేత్తలకు ఎలాంటి ఇబ్బందులు కలగరాదు

### విజయవంతంగా నిర్వహించేందుకు చర్యలు

**దుద్యాల, అక్టోబర్ 8 ( జనం సాక్షి):**మండల పరిధిలోని హకీంపేట్ సమీపంలో వ్యవసాయ అనుబంధ శాఖ,పరిశ్రమల శాఖలు ఎక్స్ పో వేదిక స్థలాన్ని జిల్లా కలెక్టర్ దీపక్ తివారిగురువారం హకీంపేట్ వ్యవసాయ అనుబంధ శాఖ,పరిశ్రమల శాఖ కు సంబంధించి హకీంపేట్ నందు అనువైన వేదికను టీజిఐఐసి వీరారెడ్డి,జిల్లా ఎస్పి స్నేహ మెహరలతో కలిసి పరిశీలించారు.రైతులకు వ్యవసాయం, ఉద్యానవన రంగాల్లో ఆధునిక సాగు పద్ధతులు, నూతన సాంకేతిక పరిజ్ఞానం, అధిక దిగుబడుల సాధన, ప్రభుత్వ పథకాలు, మార్కెటింగ్ మరియు పరిశ్రమల అవకాశాలపై అవగాహన కల్పించే ఉద్దేశంతో వ్యవసాయ మరియు పరిశ్రమల ఎక్స్ పో ను నిర్వహించేందుకు ఏర్పాట్లను పరిశీలించారు.ఈ సందర్భంగా సందర్శించే ప్రముఖ పారిశ్రామిక వేత్తలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన మౌలిక వసతులు,రైతుల రాకపోకలు, పార్కింగ్, తాగునీరు, విద్యుత్, ప్రదర్శన స్టాళ్లు



తదితర అంశాలను పరిశీలించారు.రైతులకు వ్యవసాయ, ఉద్యానవన, పరిశ్రమల రంగాలకు సంబంధించిన తాజా సాంకేతికత, నూతన విధానాలు, ప్రభుత్వ ప్రోత్సాహకాలు మరియు వివిధ పథకాలపై సమగ్ర అవగాహన కల్పించేలా పరిశ్రమల ఎక్స్ పోను విజయవంతంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో డిసి శేషగిరిరావు,కాడ ప్రత్యేక అధికారి వెంకట్ రెడ్డి,ఆర్డిఓ అనిత, వ్యవసాయ శాఖ అధికారులు మేరీ రేఖ, కవిత, హార్టీ కల్చర్ సత్తార్,ఇంజనీర్ లు సంబంధిత అధికారులు ఉన్నారు.

# విద్యార్థులకు యూత్ ఫర్ సేవా ఆధ్వర్యంలో ఎన్ఎంఎంఎస్ పుస్తకాలు అందజేత

**దుద్యాల అక్టోబర్ 8 (జనం సాక్షి):**యూత్ ఫర్ సేవా ద్వారా సుమారుగా 100 మంది విద్యార్థులకు ఆంగ్ల మాధ్యమంలోని పుస్తకాలు అందజేసినప్పటికీ నేడు తాండూర్ భాష్యం కళాశాల డైరెక్టర్ రమేష్ అందించిన తెలుగు మీడియం స్టడీ మెటీరియల్ ప్రతి పాఠశాలకు రెండు చొప్పున అందించడం జరిగిందని టీవివి రాష్ట్ర కార్యదర్శి రవీందర్ గౌడ్ తెలిపారు.ఇందులో దుద్యాల్ కి రెండు, హకీంపేట్, చిల్ముల్ మైల్వార్, రేగడి మైల్వార్ కుదురుమళ్ళ పాఠశాలలకు రెండేసి చొప్పున అందించడం జరిగింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆంగ్ల మాధ్యమంలోనే కాకుండా రాస్తున్న విద్యార్థిని విద్యార్థులకు అనుకూలంగా చదువుకోవడానికి తెలుగు మీడియం పుస్తకాలు అవసరమని దాతల సాయంతో నేడు ఆయా పాఠశాలలో తక్కువ సంఖ్యలో తెలుగు మీడియం విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ అప్లై చేసినందుకు ప్రతి పాఠశాల గురించి అందించడం చాలా సంతోషమని తెలియజేశారు మెటీరియల్ను వాడుకొని విద్యార్థిని విద్యార్థులు



మంచి ర్యాంకు సాధించాలని ఆకాంక్ష వెలిబుచ్చారు.ఈ కార్యక్రమంలో దుద్యాల పాఠశాల ప్రధానోపాధ్యాయులు మల్లప్ప,ఉపాధ్యాయులు రాములు,హకీంపేట పాఠశాల వినయ్ కుమార్ గౌడ్,చిలుమల్ మైలారం గోవర్ధన్, రవి నాయక్,ముకుంద రెడ్డి,చంద్రశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# ప్రారంభోత్సవానికి సిద్ధమైన పోలీస్ స్టేషన్, జూనియర్ కళాశాల భవనాలు

### దసరా రోజు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ప్రారంభానికి అధికారుల కరసత్తు అధునాతన సౌకర్యాలతో ముస్తాబైన రెండు భవనాలు

**బొంరాస్ పేట, అక్టోబర్ 8 (జనం సాక్షి):** దసరా నాటికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా మండల పరిధిలోని నూతన పోలీస్ స్టేషన్ భవనం,తుంకిమెట్ల సమీపంలో నిర్మిస్తున్న ప్రభుత్వం జూనియర్ కళాశాల భవనాలు సిద్ధమైనట్లు అధికారులు తెలిపారు.అధునాతన సౌకర్యాలతో ముస్తాబైన భవనాలకు పెయింటింగ్ పనులు ఇప్పటికే పూర్తి అయ్యాయి.నూతన పోలీస్ స్టేషన్ భవనం ,ప్రహరీ నిర్మాణం అంచన రూ.3 కోట్ల వ్యయంతో నిర్మించారు.రెండు మూడు రోజుల్లో ప్రహరీ నిర్మాణం పూర్తి కానుంది.ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రస్తుతం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అదనపు తరగతి గదులలో కొనసాగుతోంది.నూతన భవనం అందుబాటులోకి వస్తే విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు అందనున్నాయి.పోలీస్ స్టేషన్ భవనం అన్ని రకాల సౌకర్యాలతో ప్రజలకు సేవలు అందించేందుకు ముస్తాబయింది.మరోవైపు సిబ్బందికి మెరుగైన వసతులు నూతన భవనంలో అందుబాటులోకి రానున్నాయి.స్థానిక అధికారులు,నాయకుల ప్రత్యేక చొరవతో రెండు భవనాలు అందుబాటులోకి రానున్నాయి. సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేక చొరవ. బొంరాస్ పేట మండల పరిధిలో అభివృద్ధి పనులు సీఎం రేవంత్ రెడ్డి,నియోజకవర్గ



కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి తిరుపతిరెడ్డి సహకారంతో వేగవంతంగా జరుగుతున్నాయి.అధికారులతో సీఎం రివ్యూ నిర్వహించి, ప్రత్యేక చొరవ తీసుకోవడంతోనే భవనాలు పూర్తయ్యాయి.దసరా నాటికి సీఎం చేతుల మీదుగా పోలీస్ స్టేషన్, జూనియర్ కళాశాల ప్రారంభానికి సిద్ధం చేస్తున్నాం.

# కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

### అనుభవం, సేవలకు ప్రాధాన్యత ఇచ్చి రెగ్యులర్ చేయాలి

### : మందుముల పరమేశ్వర్‌రెడ్డి



**ఉప్పల్, అక్టోబర్ 8 (జనం సాక్షి):** వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయంలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న బోధనేతర ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు చేపట్టాలని ఉప్పల్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ బాధ్యుడు మందుముల పరమేశ్వర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డిని కలిసి ఉద్యోగుల సమస్యలను వివరించారు.గురువారం మందుముల పరమేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో విశ్వవిద్యాలయంలో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న బోధనేతర ఉద్యోగులు రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్‌రెడ్డిని కలిశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను ఆయన ఎంపీ దృష్టికి తీసుకెళ్లారు. విశ్వవిద్యాలయంలో బోధనేతర సిబ్బంది నియామకాల సమయంలో కాంట్రాక్టు ఉద్యోగుల అనుభవం, ఇప్పటివరకు అందించిన సేవలను గుర్తించి వారికి తగిన ప్రాధాన్యత కల్పించాలని పరమేశ్వర్‌రెడ్డి కోరారు. వారి అనుభవాన్ని పరిగణనలోకి తీసుకుని రెగ్యులర్ చేసేలా చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.అదేవిధంగా కాంట్రాక్టు బోధనేతర ఉద్యోగులందరికీ టైం స్కేల్ ప్రయోజనాలు అమలు చేయాలని, రెగ్యులర్ ఉద్యోగులతో సమానంగా వైద్య బీమా సౌకర్యం కల్పించాలని కోరారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఎంపీ వేం నరేందర్‌రెడ్డిని పరమేశ్వర్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు.

# బొల్లిగుట్ట తండాలో రూ.15 లక్షలతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన

### సర్పంచ్ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో భూగర్భ డ్రైనేజీ, తాగునీటి పైప్ లైన్ పనులు ప్రారంభం



**యాచారం, అక్టోబర్ 08(జనం సాక్షి )** మండల పరిధిలోని నంది వనపర్తి గ్రామ పంచాయతీ పరిధిలోని బొల్లిగుట్ట తండా అభివృద్ధికి మరో అడుగు పడింది. దశాబ్దాలుగా తండా ప్రజలు ఎదుర్కొంటున్న డ్రైనేజీ, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా గ్రామ పంచాయతీ కీలక నిర్ణయం తీసుకుంది.రూ.15 లక్షల రూపాయల వ్యయంతో చేపట్టనున్న భూగర్భ డ్రైనేజీ, వాటర్ పైప్ లైన్ పనులను ప్రారంభించారు. గ్రామ సర్పంచ్ విజయ్ కుమార్, స్థానిక వార్డు సభ్యులు గోవర్ధన్ రెడ్డితో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. బొల్లిగుట్ట తండా అభివృద్ధే తమ ప్రధాన లక్ష్యమని అన్నారు. గతంలో తండాలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో మురుగునీరు రోడ్లపైకి వచ్చి ఇబ్బందులు పడ్డారని, అలాగే తాగునీటి పైప్ లైన్ పాతబడి లీకేజీలు ఏర్పడ్డాయని తెలిపారు. ఇప్పుడు నూతనంగా భూగర్భ డ్రైనేజీ వ్యవస్థను నిర్మించడంతో పాటు, కొత్త వాటర్ పైప్ లైన్ వేయడం ద్వారా ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందుతుందని పేర్కొన్నారు.గ్రామంలోని ప్రతి తండా, ప్రతి వార్డును అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తామని, నిధుల కొరత లేకుండా అన్ని పనులు పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.

# మూత్రశాలల ఏర్పాటు చేయండి



**అంబర్పేట్ అక్టోబర్ 8 (జనంసాక్షి )**అంబర్పేట్ బతుకమ్మ కుంట భవన నిర్మాణం కార్మికుల అడ్డాపైన మహిళలకు మూత్రశాలలు ఏర్పాటు చేయాలని అంబర్పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ గారికి వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా సిఐటియు నగర ఉపాధ్యక్షులు జి.రాములు మాట్లాడుతూ బతుకమ్మ కుంట భవన నిర్మాణ కార్మికులు అనేక సంవత్సరాలుగా ఈ అడ్డ మీద నుండి రోజు కూలికి వెళుతూ జీవనం సాగిస్తున్నారు. కానీ అడ్డా దగ్గర కనీసమైనటువంటి మౌలిక సౌకర్యాలు కార్మికులకు ఏమాత్రం లేవని అయినా వారు కుటుంబం గడవడం కోసం అనేక ఇబ్బందులు పడుతూ కూలికి వెళు తున్నారని ఎండాకాలం వచ్చిందంటే చెట్టు నీడ మినహాయిస్తే విపరీతమైన ఎండ, వానాకాలం వస్తే వర్షం, అనేక ఇబ్బందులు తట్టుకొని పనికి వెళ్తా ఉంటే కూలి కోసం గంటల తరబడి వేచి చూడడంతో అక్కడ దహమేసినప్పుడు, నీళ్లు లేక యూరిన్ వచ్చినప్పుడు, మూత్రశాలలు లేక మహిళలు పురుషులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, వారు ఎమ్మెల్యే గారికి విన్నవించారు. కార్మికుల ఇబ్బందులను అర్థం చేసుకొని బతుకమ్మ కుంట లేబర్ అడ్డా దగ్గర కార్మికులకు సౌకర్యార్థం మూత్రశాలలు, మంచినీటి సౌకర్యం, 5 రూపాయల భోజనం, వానకు ఎండకు కార్మికులు ఇబ్బంది పడకుండా షెడ్డు ఏర్పాటు చేసే విధంగా కృషి చేయాలని ఎమ్మెల్యే గారికి సిఐటియు నాయకులు జి రాములు గారు, బి సి డబ్ల్యూ వర్కర్స్ యూనియన్ అడ్డా నాయకులు ఎమ్మెల్యే గారికి విన్నవించడంతో ఎమ్మెల్యే గారు వెంటనే స్పందించి రేపు ఉదయం అధికారులను అడ్డా దగ్గరికి తీసుకువచ్చి కార్మికులకు సౌకర్యాలు కల్పించే విధంగా కృషి చేస్తానని వెంటనే హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ నగర కార్యదర్శి బి సుబ్బారావు బతుకమ్మ కుంట లేబర్ అడ్డా మాజీ అధ్యక్షులు సురేష్ నాయక్, ధర్మానాయక్, అడ్డా నాయకులు సురేష్, కమిటీ మెంబర్ కవిత, సరోజ, అరుణ, కమల, అనూష, తదితరులు పాల్గొన్నారు.

# శని అమావాస్య పురస్కరించుకొని ముస్తాబవుతున్న శ్రీ శనీశ్వర ఆలయం





**మోమిన్ పేట, అక్టోబర్ 8, (జనం సాక్షి)** అక్టోబర్ 10 న శని అమావాస్య పురస్కరించుకొని మోమిన్ పేట మండలంలోని ఎన్క తల శ్రీ శంకర భారతి మహారాజ్ ఆశ్రమంలో ఉన్న శ్రీ శనీశ్వర స్వామి ఆలయం శనివారం శని అమావాస్య పురస్కరించుకొని రంగులతో ముస్తాబవుతుంది, ఆలయ ప్రాంగాలలో సప్త వృక్షాలు సప్త మందిరాలు నవ గ్రహాలను దర్శించుకుంటే మనిషికి పట్టిన శని తొలగిపోతుందని భక్తుల విశ్వాసం శని అమావాస్య శని త్రయోదశి రోజున శనీశ్వరునికి అతి ప్రీతి అయినా నల్లని నువ్వుల నూనె నల్లని గుడ్డలతో శనీశ్వర స్వామికి తైలాభిషేకం చేయించాలన్నది హిందువుల ఆచారం, పెత్తర అమావాస్య కూడా అదే రోజున రావడంతో శనీశ్వరుని వచ్చే భక్తుల సంఖ్య వేలాదిగా వస్తారని ఆలయ కమిటీ ఈవో నరేందర్ తెలిపారు భక్తుల సౌకర్యార్థం అన్నదాన కార్యక్రమం త్రాగునీటి వసతి ఉచిత వైద్య శిబిరం పార్కింగ్ సదుపాయం కల్పిస్తున్నట్లు ఆలయ అధికారి తెలిపారు

# కాలనీల తాగునీటి సమస్యలపై హెచ్ఎండబ్ల్యూఎస్ ఎండికి వినతి



**రాజేంద్రనగర్,అక్టోబర్8(జనంసాక్షి)**మణికొండ డివిజన్‌లో తాగునీటి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరుతూ రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ను, హెచ్ఎంటీఎస్ ఎండి అశోక్ రెడ్డిని మణికొండ డివిజన్ అధ్యక్షుడు బుద్దోలు శ్రీరాములు ఆధ్వర్యంలో కలిసి వినతిపత్రం అందజేశారు. నెమలి నగర్ జెఎన్‌న్యూఆర్ఎం కాలనీలో 18 బ్లాకుల్లో సుమారు 432 కుటుంబాలు నివసిస్తుండగా, ఒక్కో బ్లాక్‌కు ఒకే వాటర్ కనెక్షన్ ఉండటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. అదనపు బల్క్ వాటర్ కనెక్షన్లు ఏర్పాటు చేయాలని కోరారు. అదేవిధంగా జన చైతన్య కాలనీలో ప్రధాన నీటి పైప్‌లైన్ లేక సుమారు 500 కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయని, పైప్‌లైన్ ఏర్పాటు చేసి నీటి కనెక్షన్లు అందించాలని విజ్ఞప్తి చేశారు. సమస్యలను పరిశీలించి త్వరగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హెచ్ఎండబ్ల్యూఎస్ఎండి అశోక్ రెడ్డి హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ రామకృష్ణారెడ్డి నాయకులు జి. శ్రావణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# సత్యనారాయణ బూబ్ కుటుంబాన్ని పరామర్శించిన ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి



**తాండూరు ఆక్టోబర్ 8(జనంసాక్షి)**తాండూర్ పట్టణానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త, గోశాల మరియు టిఆర్సి క్లబ్ వ్యవస్థాపకులు సత్యనారాయణ బూబ్ అకాల మరణం చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి వారి నివాసానికి వెళ్లి భౌతికకాయానికి నివాళులు అర్పించి,వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికీ మనోధైర్యం కల్పించారు..అనంతరం వారం రోజుల క్రితం ఉప్పరి అనంతరాములు కుమార్తె మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బుయ్యని మనోహర్ రెడ్డి , వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

# రామాలయ భూమిని పరిరక్షించాలి

### అక్రమ నిర్మాణాలు తొలగించాలని డిప్యూటీ కమిషనర్‌కు వినతి



**అల్వాల్, అక్టోబర్ 8 (జనంసాక్షి):** అల్వాల్ చిలకమట్టం రామాలయానికి చెందిన భూమిని పరిరక్షించి, సర్వే నంబర్ 169లో జరుగుతున్న అక్రమ నిర్మాణాలను తొలగించాలని కోరుతూ పటోళ్ల సురేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో స్థానికులు అల్వాల్ డిప్యూటీ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించారు. సర్వే నంబర్ 169లో కొందరు అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని, వాటిని వెంటనే తొలగించి దేవాలయ భూమిని కాపాడాలని కోరారు.రామాలయ భూమి స్థానికుల మనోభావాలతో ముడిపడి ఉందని, చారిత్రక ప్రాధాన్యత కలిగిన దేవాలయ స్థలాన్ని కాపాడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొన్నారు. దేవాలయ భూమిని సర్వే చేసి హద్దులు నిర్ణయించడంతోపాటు ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అక్రమ నిర్మాణాలపై తక్షణ చర్యలు తీసుకుని ఆలయ స్థలాన్ని పరిరక్షించాలని కోరారు.

# ఇబ్రహీంపట్నంలో జాబ్ డ్రైవ్

**రంగారెడ్డి , అక్టోబర్ 08(జనం సాక్షి)**ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ సహకారంతో గురువారం జాబ్ డ్రైవ్‌ను నిర్వహించారు. ఈ జాబ్ డ్రైవ్‌లో టెక్ మహీంద్రా, కియా, ముత్తూట్ ఫైనాన్స్, ఎల్ ఎం ఎస్, శ్రీరామ్ చిట్ ఫండ్స్, వాసవీ ఐ కేర్ తదితర ప్రముఖ సంస్థలు పాల్గొని విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలను కల్పించాయి. ఆయా సంస్థల ప్రతినిధులు విద్యార్థులకు ఇంటర్వ్యూలు నిర్వహించి, ప్రతిభ ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేశారు.ఈ ఎంపిక ప్రక్రియలో పలువురు విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికై, ఆఫర్ లెటర్లను కూడా అందుకున్నారు. ఈ జాబ్ డ్రైవ్ ద్వారా విద్యార్థులకు ప్రముఖ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలను పొందే అవకాశం లభించడంతో పాటు, పరిశ్రమ అవసరాలు, నియామక ప్రక్రియ, ఉద్యోగ నైపుణ్యాలపై అవగాహన లభించింది. విద్యార్థుల్లో ఉద్యోగ నైపుణ్యాలు, ఆత్మవిశ్వాసం పెంపొందించడంతో పాటు, వారికి మెరుగైన ఉపాధి అవకాశాలు కల్పించడంలో ఇటువంటి జాబ్ డ్రైవ్‌లు ఎంతో



ఉపయోగకరంగా ఉంటాయని కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్. రాధిక తెలిపారు. ఈ కార్యక్రమంలోప్లేస్‌మెంట్ సెల్ కన్వీనర్ డా. కె. మాధవి, డా. సురేఖ, డా. డి.వి. రావు, నరేందర్ రెడ్డి, డా. రాకేష్ భవాని తదితర అధ్యాపకులు, సిబ్బంది పాల్గొని విద్యార్థులకు అవసరమైన సహకారం అందించారు.

# ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డిపై దుష్ప్రచారం తగదు

### కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి

**రంగారెడ్డి, అక్టోబర్ 8 (జనంసాక్షి):**ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్ రెడ్డి రంగారెడ్డిపై సోషల్ మీడియాలో దుష్ప్రచారం చేస్తున్న వారిని ఏమాత్రం ఉపేక్షించకుండా కఠిన చర్యలు తీసుకొని శిక్షించాలని కాంగ్రెస్ రాష్ట్రనాయకులు కొంగర విష్ణువర్ధన్ రెడ్డి అన్నారు. కలెక్టరేట్ వద్ద సమావేశం ముగించుకొని బయలుదేరుతున్న సమయంలో తెలంగాణ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఉచిత బస్సు పథకం గురించి మహిళల స్పందనను తెలుసుకోవడానికి ఆయన బస్సు ఎక్కారని తన కూతురు లాంటి అమ్మాయితో చేయి పట్టుకొని ఆప్యాయతతో మాట్లాడితే సంస్కారం లేని నాయకులు ఎమ్మెల్యేపై సోషల్ మీడియాలో విష ప్రచారం చేస్తున్నారన్నారు. దమ్ముంటే అభివృద్ధిపై ప్రశ్నించాలని రాజకీయ విమర్శ చేస్తే హుందాగా ఉండాలని సూచించారు. ఆడపిల్లల గౌరవాలకు భంగం కలిగించేలా ఉండొద్దని హితవు పలికారు. ప్రతీ మహిళను తన తల్లి, చెల్లిలా పలకరించే రంగారెడ్డి తన రాజకీయ జీవితంలో మహిళలకు అత్యంత ప్రధాన్యత ఇచ్చి గౌరవిస్తారన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో అభివృద్ధి పరుగులు పెడుతుంటే తట్టుకోలేని బీఆర్ఎస్ నాయకులు కుళ్ళుతో విమర్శించడం తగదన్నారు. ఇలాంటి వారిని క్షమించి వదిలేస్తే సమాజానికి మంచిదికాదని, మరోసారి ఆడపిల్లల గౌరవానికి భంగం కలిగేలా సోషల్ మీడియాలో వక్రీకరణలు చేయకుండా కఠినంగా శిక్షించాలన్నారు.



# బాధిత ఉపాధ్యాయ కుటుంబానికి పిఆర్టీయూ టీఎస్ చేయూత

### : లక్ష రూపాయల చెక్కు అందజేత

**యాచారం, అక్టోబర్ 8(జనం సాక్షి )**రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందిన బాధిత ఉపాధ్యాయుని కుటుంబానికి పిఆర్టీయూ టీఎస్ సంఘం ఆర్థిక సాయం అందించి అండగా నిలిచింది. యాచారం మండలం మల్కిజ్ గూడ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తూ, సర్దుబాటులో భాగంగా చౌదర్ పల్లి పాఠశాలకు వెళ్తూ రోడ్డు ప్రమాదంలో మరణించిన మస్కు సంతోష్ కుమార్ కుటుంబానికి సంఘం చేయూతనందించింది. సంతోష్ కుమార్‌కు సంఘంలో సభ్యత్వం ఉన్నందున, ఆయన భార్య మస్కు వరలక్ష్మికి సంఘ సంక్షేమ నిధి నుండి రూ.1,00,000 (లక్ష రూపాయల) చెక్కును గురువారం అందజేశారు.ఈ సందర్భంగా పంచాయత్ రాజ్ ఉపాధ్యాయ మాసపత్రిక ప్రధాన సంపాదకులు బెలిదే జగన్ మోహన్ గుప్త, రంగారెడ్డి జిల్లా నాయకులు మహేందర్ రెడ్డి, రాఘవేందర్, కృష్ణా రెడ్డిలతో



పాటు మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తిరుమలేష్, యాదగిరిలు మాట్లాడుతూ... ఈ ఆర్థిక సాయాన్ని పిల్లల ఉన్నత చదువుల నిమిత్తం ఉపయోగించుకోవాలని సూచించారు. భవిష్యత్తులోనూ ఆ కుటుంబానికి సంఘం తరఫున అన్ని విధాలా అండగా ఉంటామని భరోసానిచ్చారు.

# జీజీహెచ్ మహేశ్వరంకు రూ.20 లక్షల విలువైన అత్యాధునిక అల్ట్రాసౌండ్ యంత్రం

### సీఎస్ఆర్‌లో భాగంగా కెన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్ విరాళం

**హయత్ నగర్, అక్టోబర్ 8 (జనం సాక్షి)**ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధిలో భాగంగా కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సీఎస్ఆర్) కార్యక్రమం ద్వారా జీజీహెచ్ మహేశ్వరం (వనస్థలిపురం)కు అత్యాధునిక అల్ట్రాసౌండ్ యంత్రాన్ని విరాళంగా అందించారు.జీజీహెచ్ మహేశ్వరం సూపరింటెండెంట్ డా. బి. నాగేందర్, రేడియాలజీ విభాగాధిపతి డా. అశ్విని జ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో కెన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్ ఎల్.బి. నగర్ బ్రాంచ్ ప్రతినిధులు సుమారు రూ.20 లక్షల విలువైన ఫిలిప్స్ అల్ట్రాసౌండ్ అఫినిటీ 30 యంత్రాన్ని ఆసుపత్రికి అందజేశారు. ఈ యంత్రాన్ని కెన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్ జోనల్ హెడ్ లక్ష్మణ్ గూడా ముఖ్య అతిథిగా హాజరై, ప్రారంభించారు. కార్యక్రమంలో ఎల్.బి. నగర్ బ్రాంచ్






మేనేజర్ విక్రమ్, జీజీహెచ్ మహేశ్వరం సీఎస్ఆర్ఎంఓ డా. దామోదర్, రేడియాలజీ హెచ్‌ఓడీ డా. అశ్విని జ్యోతితో పాటు వివిధ విభాగాల హెచ్‌ఓడీలు, అసోసియేట్ ప్రొఫెసర్లు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు, నర్సింగ్ సూపరింటెండెంట్, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.ఈ సందర్భంగా సూపరింటెండెంట్ డా. బి. నాగేందర్, జోనల్ హెడ్ లక్ష్మణ్ గూడా మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రుల అభివృద్ధిలో సీఎస్ఆర్ కార్యక్రమాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. అత్యాధునిక అల్ట్రాసౌండ్ యంత్రం అందుబాటులోకి రావడంతో పేద గర్భిణీ స్త్రీలు, గైనకాలజీ రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవకాశం కలుగుతుందని పేర్కొన్నారు. ఆసుపత్రికి అత్యాధునిక వైద్య పరికరాన్ని అందించిన కెన్ ఫిన్ హోమ్స్ లిమిటెడ్ యాజమాన్యానికి జీజీహెచ్ మహేశ్వరం తరఫున సూపరింటెండెంట్ డా. బి. నాగేందర్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

## బహుజన రాజ్యాధికార సమరభేరి సభకు తరలిరండి



**కొడంగల్, అక్టోబర్ 08 (జనం సాక్షి):**కాన్షీరామ్ 20వ వర్ధంతి సందర్భంగా బహుజన్ సమాజ్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న బహుజన రాజ్యాధికార సమరభేరి సభకు కొడంగల్ నియోజకవర్గం నుంచి పెద్ద ఎత్తున తరలిరావాలని బీఎస్పీ కొడంగల్ అసెంబ్లీ ఇన్‌చార్జి యు. రమేష్ బాబు పిలుపునిచ్చారు.శుక్రవారం సాయంత్రం 4 గంటలకు బడంగ్‌పేట్, హైదరాబాద్‌లో జరిగే ఈ సభకు బీఎస్పీ నాయకులు, కార్యకర్తలు, అంబేద్కర్ వాదులు, ఎస్సీ ఎస్టీ, బిసి, మైనారిటీలు, బహుజనులు పెద్ద సంఖ్యలో పాల్గొని సభను విజయవంతం చేయాలని కోరారు.

## డీజీపీఎస్ రోవర్లతో ఉప్పర్‌పల్లిలో భూముల రీ-సర్వే



**ఉప్పర్‌పల్లి, అక్టోబర్ 08:** కొడంగల్ మండలం ఉప్పర్ పల్లి గ్రామంలో భూముల రీ-సర్వే ప్రక్రియను అధికారులు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో చేపట్టారు. డీజీపీఎస్ రోవర్లను వినియోగిస్తూ ప్రతి భూమి హద్దులను అత్యంత ఖచ్చితత్వంతో గుర్తించి, సర్వే నంబర్ల వారీగా భూముల వివరాలను నమోదు చేస్తున్నారు.ఈ సర్వే ద్వారా ప్రతి సర్వే నంబర్‌కు ఖచ్చితమైన హద్దులు నిర్ణయించడంతో పాటు, అవసరమైన చోట ప్రత్యేక సర్వే నంబర్ కేటాయించేలా అధికారులు చర్యలు చేపడుతున్నారు.ఈ కార్యక్రమంలో మండల వర్కింగ్ ప్రెసిడెంట్ ఆనంద్ రెడ్డి, గ్రామ ఉప సర్పంచ్ గోపాల్ రెడ్డి, యు.తుల్జప్ప, గురునాథ్, బాలకృష్ణ, శివకుమార్, రవి నాయక్ తదితర గ్రామస్థులు అధికారులతో కలిసి పాల్గొన్నారు.

## అనుమతులు లేని మద్యం విక్రయాలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం

### మోమిన్ పేట ఎక్సైజ్,సర్కిల్ ఇన్స్పెక్టర్.. బి ప్రభావతి



**వికారాబాద్ అక్టోబర్ 8,( జనం సాక్షి)**మోమిన్ పేట ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో ఎలాంటి అనుమతులు లేకుండా మద్యం విక్రయాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మోమినిపేట ఎక్సైజ్ సర్కిల్ ఇన్స్పెక్టర్ బి ప్రభావతి. అన్నారు. గురువారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ, మోమిన్ పేట ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో అక్రమ మద్యం, అనుమతుల్లేని మద్యం విక్రయాలు, నాటు సారా తయారు చేస్తున్న వారిపై తమ సిబ్బంది దాడులు చేసి స్వాధీనం చేసుకొని చర్యలు తీసుకుంటామని సిఐ హెచ్చరించారు. అలాగే సర్కిల్ పరిధిలో ఎక్కడైనా కల్తీ కల్లు విక్రయాలు జరిగిన, గంజాయి, నిషేధిత పదార్థాలు గుట్కా, కొకైన్ వంటి పదార్థాలను ఎక్కడైనా విక్రయించినట్లు తమ దృష్టికి వస్తే ఎంతటి వారైనా చట్టపరమైన చర్యలు తప్పవని ఆమె పేర్కొన్నారు. దసరా ఉత్సవాల సందర్భంగా ఇప్పటికే సమాచారం తెలిసిన ప్రదేశాలను తాండాలను, వైన్స్ లను, కల్లు దుకాణాలను, పాన్ షాపులను ఎప్పటికప్పుడు తనిఖీ చేయడం జరుగుతుందన్నారు .

## పట్టభద్రులంతా ఓటరుగా నమోదు చేసుకోవాలి

### బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు ఏరన్‌పల్లి శ్రీనివాస్



**కొడంగల్, అక్టోబర్ 8 (జనం సాక్షి):** మహబూబ్‌నగర్--రంగారెడ్డి--హైదరాబాద్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గ ఓటరు నమోదు ప్రక్రియలో అర్హత కలిగిన పట్టభద్రులంతా తమ పేర్లను ఓటరు జాబితాలో నమోదు చేసుకోవాలని బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, తెలంగాణ ఉద్యమకారుల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షులు ఏరన్‌పల్లి శ్రీనివాస్, బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ మడిగే శ్రీనివాస్ కోరారు.గురువారం కొడంగల్ తాహసిల్దార్ కార్యాలయంలో తాహసిల్దార్ రాంబాబు కు గ్రాడ్యుయేట్ ఓటరు నమోదు పత్రాన్ని అందజేశారు. ఫారం-18ను పూర్తి చేసి, డిగ్రీ ధ్రువపత్రం, ఆధార్ కార్డు, ఓటర్ కార్డు జిరాక్స్ ప్రతులను జత చేసి ఎమ్మార్వో కార్యాలయంలోని ఎన్నికల అధికారికి ,సహాయ నియమిత అధికారి సమర్పించాలి కోరారు.

# మ్మెల్యే మల్రెడ్డి రంగారెడ్డిని బద్నాం చేస్తే సహించేది లేదు

### : మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు



**యాచారం, అక్టోబర్ 8(జనం సాక్షి )**ఇబ్రహీంపట్నం శాసనసభ్యులు మల్రెడ్డి రంగారెడ్డిపై సోషల్ మీడియాలో జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, యాచారం మాజీ ఎంపీపీ రాచర్ల వెంకటేశ్వర్లు స్పష్టం చేశారు. బిఆర్ఎస్ (టిఆర్ఎస్) పార్టీ నాయకులు ఉద్దేశపూర్వకంగానే ఆయనపై దుష్ప్రచారం చేస్తూ బద్నాం చేయడానికి యత్నిస్తున్నారని, ఇలాంటి చర్యలను ఏమాత్రం సహించేది లేదని హెచ్చరించారు.కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల కోసం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'మహాలక్ష్మి' ఉచిత బస్సు పథకం అమలవుతున్న తీరును పరిశీలించేందుకు ఎమ్మెల్యే బొంగులూరు వద్ద ఆర్టీసీ బస్సు ఎక్కారని తెలిపారు. కదులుతున్న బస్సులో ప్రయాణికుల సదుపాయాల గురించి, ముఖ్యంగా మనవరాలి వయస్సున్న అమ్మాయితో మాట్లాడుతూ యోగక్షేమాలు అడిగి తెలుసుకున్న దృశ్యాలను వక్రీకరించి సోషల్ మీడియాలో తప్పుడు పోస్టులు పెడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేపై అసత్య ప్రచారాలు చేస్తున్న వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తప్పుడు పోస్టులు పెట్టే వారిపై అధికారులు చర్యలు తీసుకోకపోతే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో యాచారం మండల పార్టీ అధ్యక్షుడు మోటే శ్రీశైలం, జడల రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మేడిపల్లిలో ఫార్మాసిటీ రోడ్డు పనుల నిలిపివేత

### : నష్టపరిహారం ఇచ్చేదాకా కదిలేది లేదు - భూబాధిత రైతులు



**యాచారం, అక్టోబర్ 8(జనం సాక్షి )**యాచారం మండల పరిధిలోని మేడిపల్లి గ్రామంలో ఫార్మాసిటీ రోడ్డు నిర్మాణ పనులను భూబాధిత రైతులు అడ్డుకున్నారు. ప్రభుత్వం రోడ్డు నిర్మాణం కోసం పేద రైతుల వద్ద నుంచి భూములు సేకరించిందని, అయితే ఇప్పటివరకు తగిన నష్టపరిహారం చెల్లించలేదని ఆరోపిస్తూ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్మాణ స్థలంలోనే టెంట్ వేసుకుని ధర్నాకు దిగారు.సర్వే నంబర్ 202లోని ల్యాండ్‌కు సంబంధించిన నాన్నకినగర్ గ్రామానికి చెందిన చంద్రారెడ్డి, పల్లె చేల్క తండాకు చెందిన ఇస్లావత్ నందు నాయక్ ల వద్ద ఉన్న రెండు ఎకరాల భూమిని ప్రభుత్వం తీసుకుంది. పరిహారం అందిస్తామని అధికారులు గతంలో హామీ ఇచ్చి మోసం చేశారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ భూములకు పూర్తి స్థాయి నష్టపరిహారం చెల్లించే వరకు తమ స్థలం నుండి రోడ్డు పనులను సాగనిచ్చే ప్రసక్తే లేదని, తమకు న్యాయం జరిగేదాకా నిరసన విరమించబోమని భీష్మించుకూర్చున్నారు.

# వెట్టిచాకిరీ నిర్మూలనకు విస్తృత ప్రచారం

### జిల్లా అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి

### 'స్వేచ్ఛా రథం' ప్రారంభం



**రంగారెడ్డి, అక్టోబర్ 8 (జనంసాక్షి)**సమాజంలో వెట్టిచాకిరీ నిర్మూలనపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన రాష్ట్రస్థాయి 'స్వేచ్ఛా రథం' ప్రచార కార్యక్రమాన్ని నిర్వహిస్తుందని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రా రెడ్డి అన్నారు. స్వేచ్ఛా రథం' ప్రచార కార్యక్రమాన్ని గురువారం ఘనంగా జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వెట్టిచాకిరీ బాధితులు, అసంఘటిత రంగ కార్మికులకు తమ హక్కులు, చట్టపరమైన రక్షణ, అందుబాటులో ఉన్న సహాయ మార్గాలపై అవగాహన కల్పించాలని చెప్పారు. బాధితులు ఎవరైనా ఉంటే సమాచారం అందించేందుకు టోల్‌ఫ్రీ హెల్ప్‌లైన్ నంబర్ 080-69434343 ను విస్తృతంగా ప్రచారం చేయాలని తెలిపారు. జిల్లాలో వెట్టిచాకిరీని పూర్తిగా నిరోధించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని శాఖల సమన్వయంతో కట్టుదిట్టమైన చర్యలు చేపడుతోందన్నారు. వెట్టిచాకిరీకి సంబంధించిన ఫిర్యాదులు అందిన వెంటనే స్పందించి, బాధితులను గుర్తించడం, వారిని రక్షించడం, తక్షణ పునరావాసం కల్పించడం జరుగుతుందని స్పష్టం చేశారు. వ్యవసాయం, ఇటుక బట్టీలు, ఆక్వాకల్చర్, గనులు, క్వారీలు తదితర అసంఘటిత రంగాల్లో వెట్టిచాకిరీకి గురయ్యే అవకాశాలు ఎక్కువగా ఉన్నందున, 'స్వేచ్ఛా రథం' ద్వారా ఆయా ప్రాంతాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అప్పులు, అడ్వాన్సులు, బెదిరింపులు, మోసం, స్వేచ్ఛను హరించే విధంగా బలవంతంగా పని చేయించడం వెట్టిచాకిరీ కిందకు వస్తుందన్నారు. ఇది పూర్తిగా చట్టవిరుద్ధమని ఆయన హెచ్చరించారు. కార్మికులు ఎలాంటి ఒత్తిడి, బెదిరింపులకు లోనుకాకుండా, శ్రమ దోపిడీ ఎదురైతే వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సూచించారు. ఈ 'స్వేచ్ఛా రథం' జిల్లా వ్యాప్తంగా తిరిగి, కార్మికుల హక్కులు, వెట్టిచాకిరీని ఎలా గుర్తించాలన్నారు. ఎక్కడ ఫిర్యాదు చేయాలి, ప్రభుత్వపరంగా లభించే సహాయం తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పిస్తుందన్నారు.

# టీయూడబ్ల్యూజే దోమ మండల కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

### మండల కమిటీ అధ్యక్షులుగా రాము ముదిరాజ్



**దోమ అక్టోబర్ 08 జనం సాక్షి..**వికారాబాద్ జిల్లా దోమ మండల తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ నూతన కమిటీ గురువారం ఏకగ్రీవంగా ఎన్నికైంది. పరిగి నియోజకవర్గ కమిటీ అధ్యక్షుడు శ్రీనివాస్, జిల్లా నాయకులు బాబయ్య,శ్రీనివాస్ ల ఆధ్వర్యంలో నూతన కార్యవర్గానికి నియామక పత్రాలను అందజేశారు. అధ్యక్షుడులు గా రాము ముదిరాజ్,గౌరవ అధ్యక్షులుగా బంగ్లా వెంకటయ్య గౌడ్,అనంతయ్య, ఉపాధ్యక్షులుగా వడ్ల సురేందర్, కృష్ణ , ప్రధాన కార్యదర్శిగా గౌర్వర్ రాఘవేందర్ రావు,కార్యదర్శులుగా జి. విజయ్ కుమార్, వినోద్,ఆర్గనైజింగ్ కార్యదర్శిగా గొల్ల కృష్ణ, కోశాధికారిగా కోరే బిచ్చిలింగం,కార్యవర్గ సభ్యులుగా రమేష్ గౌడ్, ప్రవీణ్ కుమార్, దస్తగిరి లు ఎన్నికయ్యారు.ఈ సందర్భంగా నూతన అధ్యక్షుడు రాము ముదిరాజ్ మాట్లాడుతూ.. జర్నలిస్టుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తానని, ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సురేష్, రఘు,ఆంజనేయులు, మండల కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# లారీ చక్రాల కింద నలిగిన విద్యార్థి



**షాబాద్, అక్టోబర్ 8(జనం సాక్షి);** ఇంటికి చేరుకోవలసిన విద్యార్థి లారీ చక్రాల కింద నలిగిపోయి మృతి చెందిన సంఘటన షాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. షాబాద్ ఇన్స్పెక్టర్ చెన్నారెడ్డి తెలిపిన వివరాల మేరకు మండల పరిధిలోని నాగరగూడకు చెందిన వడ్డే రాజు కుమారుడు వడ్డే తనీష్ (11) షాబాద్ హాస్టల్లో ఉంటూ ఐదవ తరగతి చదువుతుండగా గురువారం రాజు, తనీష్ ఇద్దరూ ద్విచక్ర వాహనంపై షాబాద్ నుండి నాగర గూడ వెళ్తున్న క్రమంలో వేగంగా వచ్చిన లారీ షాబాద్ కోఆపరేటివ్ బ్యాంక్ సమీపాన వేగంగా ఢీకొట్టడంతో రాజు రోడ్డు ఎడమ వైపుకు పడిపోగా తనీష్ లారీ చక్రాల కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. గాయాల పాలైన రాజును వెంటనే చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించి ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు నిర్వహిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# అంజయ్య గౌడ్ మృతి బాధాకరం



**కేశంపేట, అక్టోబర్ 8 (జనం సాక్షి ):** బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు చుక్క అంజయ్య గౌడ్ మృతి బాధాకరమని మాజీ ఎమ్మెల్యే వై. అంజయ్య యాదవ్ అన్నారు. మండల పరిధిలోని కొనాయిపల్లి గ్రామానికి చెందిన అంజయ్య గౌడ్ అనారోగ్యంతో మృతి చెందాడు. షాద్ నగర్ మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ , మాజీ ఎంపీపీ వై.రవీందర్ యాదవ్ తదితరులు అంజయ్య గౌడ్ పార్థివ దేహానికి నివాళులు అర్పించారు. అంజయ్య గౌడ్ మృతి బీఆర్ఎస్ పార్టీకి తీరనిలోటు అని అన్నారు. కుటుంబ సభ్యులకు తమ ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామన్నారు. పరామర్శించిన వారిలో గ్రామ సర్పంచ్ సోప్పరి ధనలక్ష్మి రామకృష్ణ, నాయకులు కె.నవీన్ కుమార్, ఉలుగొండ లక్ష్మణ్, రంగు శ్రీకాంత్, సోమరాజు మహేష్, సోప్పరి నరేందర్ ఉన్నారు.

## మాజీ ఎమ్మెల్యే ఆనంద్ నోరు అదుపులో పెటుకో

### స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై లేని పోనీ ఆరోపణలు చేస్తే ని ఇంటిని ముట్టడి చేస్తాం

### మండల కాంగ్రెస్ పార్టీ ఎస్ సి సెల్ ప్రధాన కార్యదర్శి పులి గారి బాబు



**మోమిన్ పేట అక్టోబర్ 8 ( జనం సాక్షి)** వికారాబాద్. మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ నోరు అదుపులో పెట్టుకొని మాట్లాడాలి అని మోమిన్ పేట కాంగ్రెస్ పార్టీ ఎస్ సి సెల్ ప్రధాన కార్యదర్శి పులి గారి బాబు, అన్నారు.తెలంగాణా రాష్ట్ర స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పైన లేని పోనీ ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకోమని ఆయన హెచ్చరిక చేశారు.మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ నోటికి ఏది వస్తే అది మాట్లాడుతున్నారని, రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ దొర కాదు అని అన్నారు.నీవు ఎంత మంది దళితులకు దళిత బంద్ మంజూరు చేశావ్ సమాధానం చెప్పాలి అని ఆయన డిమాండ్ చేశారు.

## యూఏఈలో అసిస్టెంట్ నర్స్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం

**హైదరాబాద్ సిటీ, అక్టోబర్ 08 (జనం సాక్షి) :** యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్(యూఏఈ)లో అసిస్టెంట్ నర్స్ ఉద్యోగాల కోసం మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా ఉపాధి కల్పనాధికారి ఏ.వందన తెలిపారు. తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్పవర్ కంపెనీ లిమిటెడ్(టామ్‌కామ్) ఆధ్వర్యంలో ఈ నియామకాలు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. 20 నుంచి 40 ఏళ్ల వయస్సు, కనీసం ఏడాది పని అనుభవం ఉన్న మహిళా నర్సింగ్ వృత్తి నిపుణులు దరఖాస్తు చేసుకోవచ్చని విద్యార్హతలు, పని అనుభవం, క్లినికల్ నైపుణ్యాలు, ఇంగ్లీష్ కమ్యూనికేషన్, యూఏఈ లైసెన్సింగ్/డేటా ఫ్లో స్థితి ఆధారంగా అభ్యర్థుల ఎంపిక జరుగుతుందని తెలిపారు. ఎంపికైన వారికి ఉద్యోగ వీసా, విమాన టికెట్, రవాణా, వసతి, ప్రాథమిక వైద్య బీమా సౌకర్యాలు కల్పిస్తారని వివరించారు. ఆసక్తిగల అభ్యర్థులు 08035524946 నంబర్‌లో టామ్‌కామ్‌ను సంప్రదించవచ్చని, తమ సీవీలను పంపవచ్చని ఏ.వందన తెలిపారు.

## పేకాట స్థావరంపై పోలీసుల మెరుపు దాడి

### గంగన్నగూడెంలో పట్టుబడ్డ పేకాట రాయుళ్లు

### తొమ్మిది మంది అరెస్ట్, రూ. 36,800 నగదు స్వాధీనం




**కొందుర్గు జనంసాక్షి:**మండల పరిధిలో అసాంఘిక కార్యకలాపాలపై పోలీసులు ఉక్కుపాదం మోపారు. కొందుర్గు పోలీస్ స్టేషన్ పరిధిలోని గంగన్నగూడెం సమీపంలో గల ఒక నిర్జన ప్రదేశంలో గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న పేకాట స్థావరంపై పోలీసులు, ఎస్ఓటీ బలగాలు సంయుక్తంగా మెరుపు దాడి నిర్వహించాయి. ఈ దాడిలో తొమ్మిది మంది పేకాటరాయుళ్లను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు గురువారం కొందుర్గు పోలీసులు, ఎస్ఓటీ సిబ్బందితో కలిసి గంగన్నగూడెం శివారులోని నిర్జన ప్రాంతంలో తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో పెద్ద ఎత్తున డబ్బులు బెట్టింగులు పెడుతూ పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 36,800 నగదు, 9 మొబైల్ ఫోన్లు, మరియు వారు ప్రయాణించిన 6 ద్విచక్ర వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

### ఆదిభట్ల పోలీసు స్టేషన్ పరిధిలో ఘటన

### మృతుడు ఆంధ్రప్రదేశ్ అనంతపురం జిల్లా వాసి

**రంగారెడ్డి, అక్టోబర్ 8 (జనంసాక్షి):**కుటుంబ కలహాలతో మనస్తాపం చెంది భార్యతో గొడవ పడిన ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదిభట్ల పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై సుందరయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అనంతపురం జిల్లా గుంతకల్లు మండలం కదరపల్లికి చెందిన నాగేష్ నాయక్ (35) బాలాపూర్ మండలం నాదర్గుల్ సాయిరామనగర్‌లో నివాసముంటూ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. నాగేష్ నాయక్ రెగ్యులర్‌గా మద్యం సేవించి, ఆర్థిక ఇబ్బందుల కారణంగా తరచూ భార్యతో గొడవ పడేవాడు. ఈ క్రమంలోనే బుధవారం రాత్రి కూడా భార్యతో గొడవపడి ఇంటి నుండి బయటకు వెళ్లిపోయాడు. రాత్రి తిరిగి ఇంటికి వచ్చిన అతను, మెట్లపై ఉన్న రేకుల షెడ్ ఇనుప రాడుకు తాటితో ఉరేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. గురువారం మధ్యాహ్నం భార్య మెడపైకి వెళ్లి చూడగా నాగేష్ నాయక్ విగతజీవుడిగా వేలాడుతూ కనిపించాడు. వెంటనే ఆమె ఆదిభట్ల పోలీసులకు సమాచారం అందించింది. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని, పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై తెలిపారు.

## బొంరాస్ పేట మండలానికి 300 క్వింటాళ్ల వేరుశనగ విత్తనాలు

### నేడు రైతులకు 100% సబ్సిడీతో అందజేత

### మండల ఇన్చార్జి వ్యవసాయ అధికారి కరుణాకర్ రెడ్డి

**బొంరాస్ పేట, అక్టోబర్ 8 ( జనం సాక్షి):** మండలానికి 300 క్వింటాళ్ల వేరుశెనగ విత్తనాలు రావడం జరిగిందని మండల ఇన్చార్జి వ్యవసాయాధికారి కరుణాకర్ రెడ్డి తెలిపారు. నేషనల్ మిషన్ ఆన్ ఎడిబుల్ ఆయిల్స్, ఆయిల్ సీడ్స్ పథకం కింద 100% సబ్సిడీతో రైతులకు తుంకీమెట్ల రైతువేదికలో శుక్రవారం ఉదయం 9 గంటలకు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ విత్తనాలు తీసుకునే రైతులు తప్పనిసరిగా అరక ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ బొంరాస్ పేట వారి వద్ద సభ్యత్వం పొంది, గుర్తింపు పొందిన రైతులకు అందజేయడం జరుగుతుందన్నారు.విత్తనాలు కావలసినవారు ఎఫ్పీవో వద్ద నమోదు చేసుకోవాలన్నారు.మండల పరిధిలోని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## క్యాన్సర్ పై పోరాటంలో మనోధైర్యమే అతిపెద్ద ఆయుధం

### : డాక్టర్ రామక్రిష్ణప్రసాద్




**కాప్రా అక్టోబర్ 8 ( జనం సాక్షి)** : క్యాన్సర్ ఉందని భయపడవద్దని మనోధైర్యమే అతి పెద్ద ఆయుదమని ప్రముఖ వైద్యులు డాక్టర్ రామక్రిష్ణప్రసాద్ తెలిపారు. బుదవారం ఏఎస్రావునగర్లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. క్యాన్సర్ వచ్చిదని భయంతో ఎంతో మంది ఇబ్బంది పడుతున్నరని నేటి అదునిక సాంకేతిక పరిజ్ఞనంలో క్యాన్సర్ను తగ్గించే చికిత్సలు అందుబాటులోకి వచ్చాయని తెలిపారు. ఇప్పటికి చాల మందికి క్యాన్సర్పై అవగాహన లేదని అవగాహన ఉంటే భయపడాల్సిన పని లేదని తెలిపారు. క్యాన్సర్ను జయించేందుకు చికిత్స పాటు మనోధైర్యం ముఖ్యమని తెలిపారు. క్యాన్సర్ ఉన్న బాగాన్ని గుర్తించి ఎక్కడ క్యాన్సర్ ఉంటే అక్కడే చికిత్స అందించేందుకు భారతదేశంలోనే మోదటిసారిగా సికింద్రాబాద్ యాశోద ఆసుపత్రిలో అత్యదునిక హైపర్ సైట్ యంత్రం అందుబాటులో ఉందని తెలిపారు. ఈ మిషన్ తో ఎలాంటి సైడ్ ఎఫెక్ట్ లేకుండ, తక్కువ సమయంలో కచ్చితమైన చికిత్స అందుతుందని తెలిపారు. క్యాన్సర్ను మోదటి స్తాయిలోనే గుర్తిస్తే పూర్తిగా నయం చేయవచ్చని తెలిపారు. ఈకార్యక్రమంలో ప్రతినిదులు రాజేష్. అకుల ప్రమోద్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కాలువలో పడితే..కష్టమే, మెట్లు లేక పశువుల రక్షణకు ఇబ్బందులు

### నీటిపారుదల శాఖ ఈఈకి సర్పంచ్,ప్రజల విన్నపం

**ధారూర్ అక్టోబర్ 08(జనంసాక్షి)**కోట్‌పల్లి ప్రాజెక్టు పెద్ద కాలువ కుడి కాలువకు మెట్లు నిర్మించాలని ధారూర్ మండలం నాగసముందర్ గ్రామ సర్పంచ్ కొల్లి వెంకటేశ్వర్‌తో పాటు గ్రామ ప్రజలు నీటిపారుదల శాఖ వికారాబాద్ ఈఈకి విన్నవించారు. నాగసముందర్ గ్రామంలో పెద్ద ఎత్తున పశుసంపద ఉందని,పశువులు మేతకు వెళ్లే సమయంలో ప్రమాదవశాత్తు కాలువలో పడుతున్నాయని తెలిపారు.కోట్‌పల్లి ప్రాజెక్టు నుంచి సుమారు మూడు కిలోమీటర్ల దూరం వరకు కాలువకు ఎక్కడా మెట్లు లేకపోవడంతో పశువులు కాలువలో పడితే వాటిని బయటకు తీయడం తీవ్ర ఇబ్బందిగా మారుతోందని పేర్కొన్నారు.ముఖ్యంగా కాలువలో నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న సమయంలో పశువులు ప్రమాదవశాత్తు కాలువలో పడితే బయటకు రాలేక ప్రాణాలు కోల్పోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో పలుమార్లు పశువులు కాలువలో పడిన సందర్భాల్లో వాటిని బయటకు తీసేందుకు రైతులు,గ్రామస్థులు తీవ్రంగా శ్రమించాల్సి వచ్చిందన్నారు.పశువుల ప్రాణాలను కాపాడేందుకు కాలువకు ఇరువైపులా ప్రతి కిలోమీటరుకు మెట్లు నిర్మించాలని కోరారు.



ముఖ్యంగా చిన్న పొలం జంగం దశరథ్ పొలం కొంపల్లి నర్సింలు పొలం ఇసుక బావి తూము. రావిగడ్డ తూము.మేకల తూము వద్ద మెట్లు ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.కాలువలో పశువులు పడినప్పుడు అత్యవసరంగా బయటకు తీసేలా అనువైన ప్రాంతాల్లో మెట్లు నిర్మించాలని,సమస్యను క్షేత్రస్థాయిలో పరిశీలించి వెంటనే చర్యలు తీసుకోవాలని నాగసముందర్ సర్పంచ్ కొల్లి వెంకటేశ్వర్,గ్రామ ప్రజలు నీటిపారుదల శాఖ అధికారులను కోరారు.

## ఆర్చరీ ప్రీమియర్ లీగ్‌కు యోధాస్ జట్టు

### ఎనిమిది మంది సభ్యులతో జట్టు ప్రకటన




**ముషీరాబాద్, అక్టోబర్ 8 (జనం సాక్షి):**ఎబిక్స్ గ్రూప్ టైటిల్ స్పాన్సర్‌గా వ్యవహరిస్తున్న ప్రిత్వీరాజ్ యోధాస్.. ఆర్చరీ ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) సీజన్-2 కోసం ఎనిమిది మంది సభ్యుల జట్టును ప్రకటించింది. రణదీప్ హుడా, లిన్ లైశ్రామ్ సహ యాజమాన్యంలో ఉన్న ఈ జట్టులో భారతీయ, అంతర్జాతీయ ఆర్చర్లకు చోటు కల్పించారు. ఆండ్రియా బెసెర్రా, మాటియాస్ గ్రాండెతో పాటు అభిషేక్ వర్మ, కీర్తి శర్మ, తిరుమూరు గణేష్, మణి రత్నం, గాథా ఆనంద్రాని ఖడకి, రాజ్ కౌర్, జుయెల్ సర్కార్ జట్టులో ఉన్నారు. సీజన్-2లో 6 జట్ల నుంచి 48 మంది ఆర్చర్లు బరిలోకి దిగనున్నారు. వీరిలో 36 మంది భారతీయులు, 12 మంది అంతర్జాతీయ క్రీడాకారులు ఉన్నారు. అక్టోబర్ 8 నుంచి 18 వరకు హైదరాబాద్‌లోని పీపుల్స్ ప్లాజాలో పోటీలు జరగనున్నాయి. లీగ్ దశలో ప్రతి జట్టు 10 మ్యాచ్‌లు ఆడనుండగా.. టాప్-4 జట్లు సెమీఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి. ఫైనల్ అక్టోబర్ 18న నిర్వహించనున్నారు.సీజన్-2లో ప్రపంచ స్థాయి ఆర్చర్లతో పాటు దీపికా కుమారి, అతాను దాస్, బొమ్మదేవర ధీరజ్, జ్యోతి సురేఖ వెన్నం వంటి భారత స్టార్ ఆర్చర్లు కూడా పాల్గొననున్నారు. ప్రతి బాణానికి 15 సెకన్ల షూట్ క్లాక్ ఉండటంతో పోటీ మరింత ఉత్కంఠభరితంగా సాగనుంది.

## పులుమామిడి గ్రామంలో ప్రజల సమస్యలు తీర్చడానికి ఎల్లవేళలా అండగా ఉంటా

### గ్రామ సర్పంచ్ దాన నర్సింలు



**నవాబుపేట్ అక్టోబర్ 8 ( జనం సాక్షి):**నవాబుపేట్ మండల పరిధిలోని పులుమామిడి గ్రామంలో గ్రామ ప్రజలకు ఎన్ని సమస్యలున్న ఏ ఇబ్బందులు ఉన్నా తాను ముందుండి ఆ సమస్యలు తీర్చి దిద్దడానికి ఎల్లవేళలా అందుబాటులో ఉంటాను అంటూ గత నాలుగు రోజుల నుండి గ్రామంలో మంచినీటి సమస్య ఉన్నందున నేటి సమస్య తీర్చడానికి తన వంతుగా నూతనంగా 2,బోర్ ను వేసి నీటిని గ్రామం ప్రజలకు అందించే విధంగా ప్రయత్నం చేస్తానని గురువారం గ్రామంలో నూతనంగా బోరును వేయించి గ్రామంలోని నీటి సమస్యను తీరుస్తానని ఆయన తెలిపారు. బోరు వేయించి పైపులైన్ల ద్వారా గ్రామం ప్రజలకు అందించే విధంగా రెండు మూడు రోజుల్లో నీటి సమస్యను తీర్చి దిద్దడానికి రెండు లేదా మూడు బోర్లను వేయించి నీటిని తరపున చేస్తానని ఆయన తెలిపారు. వికారాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి మేడిపల్లి వెంకటయ్య, గ్రామఉపసర్పంచ్ బుజ్జి కింది నాగిరెడ్డి,గ్రామపంచాయతీ వార్డు సభ్యులు గ్రామస్తుల ఆధ్వర్యంలో నూతనంగా బోరును వేయించినారు. దసరా పండుగ వస్తున్న సందర్భంగా గ్రామం ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా వీధి లైట్లు, అండర్ డ్రైనేజీ, బ్లీచింగ్ పౌడర్, గ్రామాన్ని సస్యశ్యామలంగా ఆదర్శంగా ఉండే విధంగా ప్రయత్నం చేస్తానని సర్పంచ్ నర్సింలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి నితిన్, అమీర్ ఖాన్, బుచ్చిరెడ్డి, సుధాకర్, మల్లేశం, అంజయ్య,శ్రీనివాస్,గ్రామ పంచాయతీ వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# క్రేన్ టైర్ల కింద పడి 18 ఏళ్ల వలస కార్మికుడు దుర్మరణం

## కొందుర్గు స్కాన్ ఎనర్జీ కంపెనీలో ఘోర ప్రమాదం

### ఘటనపై ప్రాథమిక దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపిన పోలీసులు

### మృతదేహం ఉస్మానియాకు తరలింపు

**కొందుర్గు జనంసాక్షి:**కొందుర్గు గ్రామ శివార్లలో ఉన్న స్కాన్ ఎనర్జీ ఎ పవర్ లిమిటెడ్ కంపెనీలో జరిగిన ప్రమాదంలో ఒక వలస కార్మికుడు మృతి చెందిన ఘటనపై పోలీసులు ప్రాథమిక దర్యాప్తును ప్రారంభించారు. ఈ ఘటనకు సంబంధించిన వివరాలను కొందుర్గు పోలీసులు అధికారికంగా వివరించారు.పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం:మధ్యప్రదేశ్ రాష్ట్రం, పాన్ ఓసిక్ ప్రాంతానికి చెందిన బాల కిషన్ కౌండర్ (18), తండ్రి బురకా కౌండర్ అనే యువకుడు సదరు కంపెనీలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. (గురువారం) కంపెనీ ఆవరణలో విధులు నిర్వహిస్తుండగా, అక్కడ ఉన్న ఒక భారీ క్రేన్ వెనుక వైపు టైర్ల కింద అనుకోకుండా పడిపోయాడు. ప్రమాద తీవ్రతకు క్రేన్ టైర్లు శరీరంపై నుంచి దూసుకెళ్లడంతో సదరు యువకుడు అక్కడికక్కడే మరణించినట్లు పోలీసులు ప్రాథమికంగా గుర్తించారు.ఈ ప్రమాదం జరిగిన వెంటనే కంపెనీ ప్రతినిధులు స్థానిక పోలీసులకు ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా, మృతదేహాన్ని ఆసుపత్రికి తరలించినట్లు తమ దృష్టికి వచ్చిందని పోలీసులు తెలిపారు. ఈ వ్యవహారంలో కంపెనీ




యాజమాన్యం నిబంధనలను ఉల్లంఘించిందా అనే కోణంలో విచారణ జరుపుతున్నారు.ప్రస్తుతం ఈ ఘటనపై ఇంకా ఎలాంటి అధికారిక కేసు నమోదు కాలేదని, ప్రమాదం ఎలా జరిగింది? యాజమాన్యం లేదా క్రేన్ డ్రైవర్ నిర్లక్ష్యం ఉందా? మరియు పోలీసులకు సమాచారం ఇవ్వకుండా మృతదేహాన్ని ఎందుకు తరలించాల్సి వచ్చింది? అనే అంశాలపై పోలీసులు ముమ్మరంగా దర్యాప్తు జరుపుతున్నారు. బాధిత కుటుంబ సభ్యుల నుంచి వచ్చే ఫిర్యాదు లేదా ప్రాథమిక విచారణ నివేదిక ఆధారంగా తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

# కేశంపల్లి తండా, అత్తాపూర్ గ్రామాల రైతులకు పంటల వైవిధ్యీకరణపై రైతులకు అవగాహన

### ప్రిన్సిపాల్ సైంటిస్ట్ ఆర్ డి. డాక్టర్ ప్రసాద్మండల వ్యవసాయ అధికారి జ్యోతి

**నవాబుపేట్ అక్టోబర్ 8 ( జనం సాక్షి)**నవాబుపేట: కేశంపల్లి తండా, అత్తాపూర్ గ్రామంలోకార్యక్రమాల్లో భాగంగా రైతులకు పంటల వైవిధ్యీకరణ, నూనెగింజల సాగు మరియు ఆధునిక వ్యవసాయ సాంకేతికతలపై అవగాహన కల్పించేందుకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. వికారాబాద్, తాండూర్ మరియు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమంలో వికారాబాద్ కోఆర్డినేటర్ డా. ఉమారాజశేఖర్, ఏ ఆర్ ఎస్ తాండూర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ ఎ హెడ్ డా. సి. సుధారాణి, నవాబుపేట మండల వ్యవసాయ అధికారి జ్యోతి, ప్రిన్సిపల్ సైంటిస్ట్ డా. ఆర్.డి. ప్రసాద్, ఏ ఎస్ ఆర్ తాండూర్ సైంటిస్ట్ మాణిక్య మినీ, అత్తాపూర్ సర్పంచ్ సంతోష్ రెడ్డి, ఏఎంసి చైర్మన్ రాథోడ్ గీత సింగ్ తదితరులు పాల్గొన్నారు.ఈసందర్భంగా జి ఆర్ వి కె వికారాబాద్ కోఆర్డినేటర్ డా.ఉమారాజశేఖర్ మాట్లాడుతూ, వర్షాధార ప్రాంతాల్లో రైతులు ఒకే పంటపై ఆధారపడకుండా పంటల వైవిధ్యీకరణను చేపట్టాలని సూచించారు. తక్కువ నీటి లభ్యత ఉన్న పరిస్థితుల్లో కుసుమ వంటి నూనెగింజల పంటలను సాగులోకి తీసుకురావడం ద్వారా రైతులకు అదనపు ఆదాయ అవకాశాలు లభిస్తాయని తెలిపారు. శాస్త్రవేత్తలు సూచించే ఆధునిక సాంకేతిక పద్ధతులను రైతులు క్షేత్రస్థాయిలో అమలు చేయాలని కోరారు.ఏ ఆర్ ఎస్ తాండూర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ ఎ హెడ్ డా. సి. సుధారాణి మాట్లాడుతూ, రైతులు నూనెగింజల పంటలకు ప్రాధాన్యత ఇవ్వాలని, ముఖ్యంగా ప్రాంతీయ పరిస్థితులకు అనుగుణంగా కుసుమ వంటి ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయాలని సూచించారు. శాస్త్రీయ సాగు పద్ధతులను పాటించడం ద్వారా పంట దిగుబడులు మరియు నాణ్యతను మెరుగుపరుచుకోవచ్చని తెలిపారు.నవాబుపేట మండల వ్యవసాయ అధికారి జ్యోతి మాట్లాడుతూ,



ప్రభుత్వం అమలు చేస్తున్న టి ఎస్ పి, ఎస్సీ ఎస్సీ కార్యక్రమాల ద్వారా అందుతున్న సాంకేతిక సహాయం మరియు విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రైతులు పంటల ఎంపికలో స్థానిక వాతావరణం, నీటి లభ్యత మరియు మార్కెట్ అవకాశాలను పరిగణనలోకి తీసుకోవాలని తెలిపారు.కార్యక్రమంలో భాగంగా చిట్టిగడ్డ మరియు కేశంపల్లి తండాలకు చెందిన డి.ఎస్.పి , ఎస్సీ ఎస్టీ రైతులతో కలిపి మొత్తం 130 మంది రైతులకు సఫ్లోవర్ (కుసుమ) ఐ ఎస్ ఎఫ్ -764 రకం విత్తనాలను పంపిణీ చేశారు.అలాగే ప్రిన్సిపల్ సైంటిస్ట్ డా. ఆర్.డి. ప్రసాద్ బయోపాలిమర్ టెక్నాలజీపై రైతులకు వివరించి, దాని వినియోగ విధానాన్ని ప్రత్యక్షంగా ప్రదర్శించారు. బయోపాలిమర్ వినియోగం ద్వారా విత్తనాల చుట్టూ తేమను నిలుపుకోవడం, విత్తన మొలక మరియు ప్రారంభ దశలో మొక్కల పెరుగుదలకు కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించారు.కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారులు ఆదిల్, పవన్, రాజు తదితరులు పాల్గొని రైతులకు అవసరమైన సాంకేతిక సహకారం అందించారు. మొత్తం 130 మంది రైతులు ఈ కార్యక్రమంలో పాల్గొని శాస్త్రవేత్తల నుంచి పంటల సాగు మరియు ఆధునిక సాంకేతికతలపై అవగాహన పొందారు.

# బతుకమ్మ పండుగ తెలంగాణ సంస్కృతికి ప్రతీక

### ప్రకృతిని, స్త్రీ శక్తిని ఆరాధించే గొప్ప పండుగ

### ఆర్బీఓఎల్ ఎండీ సరళా శ్రీనివాస్ రెడ్డి

**తాండూరు అక్టోబర్ 8( జనంసాక్షి)**బతుకమ్మ అంటే మామూలు సందడి కాదు. తొమ్మిది రోజులు... తొమ్మిది రంగులు... వీధి వీధి పూల వనమే.ఉదయం లేవగానే ఆడబిడ్డలు గుంపులుగా బయలుదేరి తంగేడు, గునుగు, బంతి, చామంతి పూల కోసం పొలం గట్ల వెంట తిరగడం... మధ్యాహ్నం అంతా ఇంట్లో అమ్మ, కూతురు, కోడలు కలిసి గుండ్రంగా, గోపురంలా బతుకమ్మను పేర్చడం... సాయంత్రం కాగానే కొత్త చీరలు కట్టుకుని, పసుపు బొట్టుతో బతుకమ్మను నెత్తిన పెట్టుకుని వీధిలోకి రావడం... ఆ దృశ్యం చూడటానికి రెండు కళ్లు చాలవు.రాబోయే బతుకమ్మ పండుగ సందర్భంగా ఆర్బీఓఎల్ ఎండీ సరళా శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ బతుకమ్మ పండుగ అనేది కేవలం పూల పండుగ మాత్రమే కాదు, తెలంగాణ ఆడబిడ్డల ఆత్మగౌరవానికి, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక. తొమ్మిది రోజుల పాటు జరుపుకునే ఈ పండుగ ప్రకృతిని, స్త్రీ శక్తిని ఆరాధించే గొప్ప పండుగ" అని అన్నారు.రంగురంగుల పూలతో బతుకమ్మను పేర్చడం వెనుక ఆయుర్వేద రహస్యం ఉంది. తంగేడు, గునుగు, బంతి వంటి పూలు వర్షాకాలంలో వచ్చే అనారోగ్యాలను దూరం చేస్తాయి. ఆడబిడ్డలంతా ఒకచోట చేరి ఆడి పాడటం వల్ల ఆరోగ్యం, ఐక్యత పెరుగుతాయి అని ఆమె తెలిపారు.రాబోయే బతుకమ్మ పండుగను తాండూరు నియోజకవర్గంలోని ప్రతి ఆడబిడ్డ ఘనంగా, సంతోషంగా జరుపుకోవాలి. మన సంస్కృతిని భావి తరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉంది. ప్రభుత్వం తరపున కూడా బతుకమ్మ చీరల పంపిణీ, వేడుకలకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలి అని సరళా శ్రీనివాస్ రెడ్డి పిలుపునిచ్చారు. పండుగ రోజు పుట్టింటికి వచ్చిన ప్రతి ఆడబిడ్డ మొహంలో కనిపించే సంతోషం... అది మాటల్లో చెప్పలేనిది. ఇది కేవలం పూలను పేర్చడం కాదు, మన బంధాలను, మన మూలాలను పేర్చుకోవడమని అన్నారు.ఇప్పుడు ఉద్యోగాల కోసం, చదువుల కోసం ఎక్కడెక్కడో ఉన్న ఆడబిడ్డలంతా బతుకమ్మ పండుగకు తాండూరుకు వస్తున్నారు. ఈసారి బతుకమ్మ పండుగను మరింత ఘనంగా, వైభవంగా జరుపుకుందాం. ప్రతి వార్డులో, ప్రతి బస్తీలో బతుకమ్మ ఆటలు, పాటలతో తాండూరును పూల స్వర్గంగా మార్చుదామని ఆమె పిలుపునిచ్చారు.



## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన బిఎస్ఆర్



**తాండూరు అక్టోబర్ 8(జనంసాక్షి)**తాండూర్‌కు చెందిన ప్రముఖ వ్యాపారవేత్త శ్రీ సత్యనారాయణ జీ బూబ్ గారు ఆకస్మికంగా మృతి చెందడంతో, ఆర్బిఓఎల్ సీఈఓ,కాంగ్రెస్ నాయకులు బుయ్యని శ్రీనివాస్ రెడ్డి (బిఎస్ఆర్) వారి నివాసానికి చేరుకుని కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు.ఈ సందర్భంగా మృతుని ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ప్రార్థించారు.

## రోడ్డు ప్రమాద బాధితుడిని పరామర్శించిన భాజపా జిల్లా అధ్యక్షుడు




**శంషాబాద్,అక్టోబర్8(జనంసాక్షి)**తొండుపల్లి వద్ద ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన బీజేపీ సీనియర్ కార్యకర్త పాత్లవత్ రామారావును రంగారెడ్డి జిల్లా భాజపా అధ్యక్షుడు పంతంగి రాజ్ భూపాల్ గౌడ్ గురువారం పరామర్శించారు. ప్రమాదం అనంతరం రామారావు అపోలో ఆసుపత్రిలో కొన్ని రోజుల పాటు అత్యవసర చికిత్స పొందారు. వైద్యుల చికిత్సతో కోలుకుని డిశ్చార్జ్ అయి ఇంటికి చేరుకున్న విషయం తెలుసుకున్న జిల్లా అధ్యక్షుడు పార్టీ నాయకులతో కలిసి ఆయన నివాసానికి వెళ్లారు.ఈ సందర్భంగా రామారావు ఆరోగ్య పరిస్థితిని, చికిత్స వివరాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని ఆకాంక్షించారు. పార్టీ కోసం ఎన్నో సంవత్సరాలుగా కష్టపడి పనిచేస్తున్న సీనియర్ కార్యకర్తలకు బీజేపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, రామారావుకు భవిష్యత్తులో ఏ అవసరం వచ్చినా పార్టీ తరపున పూర్తి సహకారం అందిస్తామని రాజ్ భూపాల్ గౌడ్ భరోసా ఇచ్చారు. ఎన్. మల్లారెడ్డి, పి. మల్లేష్ యాదవ్, ఎస్ విజయ్ కుమార్, వెంకటరమణ గుప్తా, ఎన్ జగన్, బుద్ర అభినయ్ గౌడ్ శేఖర్ గౌడ్ లు పరామర్శించారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి,మరొకరికి గాయాలు



**మొయినాబాద్,అక్టోబర్ 08, జనం సాక్షి:**మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ మేరకు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మొయినాబాద్ గ్రామానికి చెందిన దుబ్బ సుభాష్ వయస్సు (35) గురువారం టీఎస్ 07 జీకె 5452 నంబర్ గల తన ద్విచక్ర వాహనంపై అతని తోపాటు ఛత్తీస్ గడ్ రాష్ట్రానికి చెందిన జయంత్ బల్, వయస్సు (41) ఇద్దరు కలిసి హైదరాబాద్ వెళ్తున్నారు. ఆ సమయంలో ఎదురుగా వస్తున్న టీఎస్ 07 హెచ్ సీ 3402 నంబర్ గల కారు డ్రైవర్ పుత్తారి నవీన్ అతివేగంగా, నిర్లక్ష్యంగా ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ఘటనలో దుబ్బ సుభాష్ తలకు గాయం కావడంతో భాస్కర్ హాస్పిటల్ తరలించగా వైద్యులు పరిశీలించారు. మృతి చెందాడని వైద్యులు తెలిపారు. ప్రమాదంలో గాయపడిన జయంత్ బల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని పోలీసులు తెలిపారు.

# బిజెపి బలోపేతమే లక్ష్యం



**రాజేంద్రనగర్,అక్టోబర్8(జనంసాక్షి)**బీజేపీ రాజేంద్రనగర్ నియోజకవర్గ దేవదాయ శాఖ అసెంబ్లీ కన్వీనర్‌గా తనకు అప్పగించిన బాధ్యతను అంకితభావంతో నిర్వహిస్తానని కలిశెట్టి రాజుస్వామి తెలిపారు. గురువారం జిల్లా అధ్యక్షుడు రాజ్ భూపాల్ గౌడ్‌తో పాటు సీనియర్ నాయకులను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా రాజుస్వామి మాట్లాడుతూ పార్టీ తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ నాయకులు, కార్యకర్తల సమన్వయంతో నియోజకవర్గంలో బీజేపీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. దేవాదాయ శాఖ అంశాలతో పాటు ప్రజా సమస్యలపై పార్టీ తరఫున చురుగ్గా పనిచేస్తానని తెలిపారు.

# మొయినాబాద్ మున్సిపాలిటీ 14వ వార్డులో తీవ్ర నీటి ఎద్దడి

### ప్రభుత్వం ఆదుకోక వాటర్ ఎయిడ్ ఇండియాను వేడుకున్న కౌన్సిలర్ కర్రోల్ల శ్రీధర్

### తాగునీటి కోసం అల్లాడుతున్న 300 కుటుంబాలు - బోరు, పైప్ లైన్ వేసి ఆదుకోవాలని విజ్ఞప్తి



**మొయినాబాద్, అక్టోబర్ 08, జనంసాక్షి:** మున్సిపాలిటీ పరిధిలోని 14వ వార్డు క్వార్టర్స్ వద్ద నెలకొన్న తీవ్ర నీటి కొరతకు ప్రభుత్వం నుంచి ఎటువంటి సహాయం అందకపోవడంతో ఆ వార్డు కౌన్సిలర్ కర్రోల్ల శ్రీధర్ చివరకు వాటర్ ఎయిడ్ ఇండియా సంస్థను ఆశ్రయించారు. మొయినాబాద్ మున్సిపాలిటీ 14వ వార్డు క్వార్టర్స్ లో సుమారు 200 నుండి 300 కుటుంబాలు నివసిస్తున్నాయి. ఇక్కడ గతంలో నిర్మించిన 20 వేల లీటర్ల చిన్న గ్రౌండ్ వాటర్ ట్యాంక్ తప్ప ఓవర్ హెడ్ ట్యాంక్ లేదు. దీంతో ఇండ్లలోకి నీరు సరిగా రాక ప్రజలు నిత్యం తాగునీటి కోసం అవస్థలు పడుతున్నారు. అంతేకాకుండా ఈ వార్డులో కనీసం అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ లేదు, సరైన రోడ్లు లేవు, ఖాళీ స్థలాల్లో చెత్తాచెదారం, చెట్ల పొదలు విపరీతంగా పెరిగిపోయి నిత్యం పాములు, తేళ్లు ఇండ్లలోకి వస్తున్నాయని, తాను స్వయంగా వార్డులో సమస్యలు అడగడానికి వెళ్తున్నప్పుడే తన కళ్ల ముందే పాము వచ్చిందని కౌన్సిలర్ తెలిపారు. ఇటీవల 15 రోజుల క్రితం కూడా ఒక వ్యక్తిని పాము కరవడంతో ఉస్మానియా ఆసుపత్రికి తరలించారని, ప్రజలు ప్రాణభయంతో బతుకుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యల పరిష్కారం కోసం తాను గెలిచిన నాటి నుండి సొంతంగా ఎస్టిమేషన్లు వేయించుకొని అధికారుల చుట్టూ, ప్రజాప్రతినిధుల చుట్టూ, ఎమ్మెల్యే, మంత్రుల చుట్టూ తిరుగుతున్నా ఏ ఒక్కరూ పట్టించుకోవడం లేదని, మున్సిపల్ కౌన్సిల్ జరిగిన ప్రతి సమావేశంలోనూ ఈ విషయాన్ని లేవనెత్తినా తవ్వి పారేసిన పనులకే బడ్జెట్ లేదని కాంగ్రెస్ ప్రభుత్వం చేతులెత్తేసిందని ఆయన అన్నారు. దీంతో చేసేదేమీ లేక కౌన్సిలర్ కర్రోల్ల శ్రీధర్ 14వ వార్డు నివాసితులతో కలిసి వాటర్ ఎయిడ్ ఇండియా సంస్థ ప్రతినిధులను వార్డుకు పిలిపించి మాకు ప్రభుత్వం నుంచి ఏ సహాయం అందడం లేదు, దయచేసి మీరైనా మా వార్డులో ఒక బోరు మోటారు వేసి, కొత్త పైప్ లైన్ వేసి మా 300 కుటుంబాలకు నిత్యం తాగునీరు వచ్చేలా చేయాలని బ్రతిమిలాడి వేడుకున్నారు. దీనికి స్పందించిన వాటర్ ఎయిడ్ ఇండియా సంస్థ వార్డులో జల్ సంకల్ప్ పేరుతో నీటి సంరక్షణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని నీటిని ఆదా చేయాలంటూ ప్లకార్డులు ప్రదర్శించారు.

# ఎమ్మెల్సీ ఓటరు నమోదు కార్యక్రమాన్ని సద్వి నియోగం చేసుకోవాలి

### :ఎంసి పల్లి తహసీల్దార్ మహమ్మద్ గులాం ఇద్రిస్



**శామీర్ పేట్, అక్టోబర్ 8(జనం సాక్షి )**మూడుచింతలపల్లి తహసీల్దార్ కార్యాలయంలో గురువారం తహసిల్దార్ మహమ్మద్ గులాం ఇద్రిస్ వివిధ పార్టీల రాజకీయ నాయకులతో ఎమ్మెల్సీ ఓటరు నమోదుపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ... మూడు చింతలపల్లి మండలం లోని అన్ని గ్రామాల్లో సంబంధిత బూత్ లెవెల్ అధికారులకు (బి ఎల్ ఓ )ఫారం-18 అంద జేయడం జరిగిందని ఎమ్మెల్సీ ఓటరు నమోదు చేసుకునేవారు బిఎల్ఓ ల నుండి ఫారం -18 తీసుకొని ఆన్లైన్ లేదా ఆఫ్లైన్ ద్వారా తమ ఓటు హక్కును నమోదు చేసుకోవాలని తెలిపారు. 7-11-2023నాటికీ డిగ్రీ పూర్తి చేసిన వారు ఎమ్మెల్సీ ఓటరు నమోదు కు అర్హులని. ఎమ్మెల్సీ ఓటు హక్కును ఆన్లైన్ ద్వారా నమోదు చేసుకోవచ్చని లేదంటే నేరుగా తహసీల్దార్ కార్యాలయంలో ఓటర్ నమోదుకు ప్రత్యేక కౌంటర్(హెల్ప్ డెస్క్) ఏర్పాటు చేయడం జరిగిందని అర్హులైన వారు తమ దరఖాస్తు ఫారం ను పూర్తి చేసి సంబంధిత పత్రాలను జతపరిచి ప్రత్యేక కౌంటర్లో సమర్పించా లని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఈ సందర్భంగా తహసీల్దార్ గులాం ఇద్రిస్ తెలిపారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ భిక్షం, ఆర్ఐ అన్వేష్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు దోసకాయల వెంకటేశం, మండల బిజెపి అధ్యక్షులు నరేందర్, వివిధ పార్టీల నాయకులు బసవ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి,యాదగిరి,తదితరులు పాల్గొన్నారు.

# మొయినాబాద్ కేసులు రాజేంద్రనగర్ కోర్టు పరిధిలోనే కొనసాగించాలని ప్రభుత్వానికి వినతి

### దూరం పెరగడంతో కక్షిదారులకు ఇబ్బందులు తప్పవంటున్న స్థానికులు



**మొయినాబాద్, అక్టోబర్ 08, జనంసాక్షి:** మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన క్రిమినల్ కేసులను చేవెళ్ల కోర్టుకు బదిలీ చేసే నిర్ణయంపై స్థానిక కక్షిదారులు, ప్రజల్లో అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం ఇటీవల ఫ్యూచర్ సిటీ కమిషనరేట్ పరిధిని పునర్వ్యవస్థీకరించింది. ఇందులో మొయినాబాద్‌ను లా అండ్ ఆర్డర్ డివిజన్‌గా ఏర్పాటు చేసింది. మొయినాబాద్ నుంచి చేవెళ్లకు సుమారు 18 కిలోమీటర్ల దూరం ఉండగా.. రాజేంద్రనగర్ కోర్టుకు సుమారు 14 కిలోమీటర్ల దూరం మాత్రమే ఉంటుందని స్థానికులు చెబుతున్నారు. హైదరాబాద్‌కు సమీపంగా ఉండటంతో పాటు రాజేంద్రనగర్ వైపు రాకపోకలు సులభంగా ఉంటాయని పేర్కొంటున్నారు. మొయినాబాద్ పోలీస్‌స్టేషన్‌కు సంబంధించిన కేసులు గతంలో రాజేంద్రనగర్ కోర్టులో విచారణకు వచ్చిన దాఖలాలు ఉన్నాయి.ప్రజలకు ఇబ్బందులు తప్పవంటూ.. ఆందోళనకేసుల విచారణ కోసం నిందితులు, బాధితులు, సాక్షులు, న్యాయవాదులు తరచూ కోర్టుకు హాజరు కావాల్సి ఉంటుందని.. కోర్టు మారితే ప్రయాణ భారం, సమయం పెరుగుతాయని స్థానిక కక్షిదారులు అభిప్రాయపడుతున్నారు. భవిష్యత్తులో మొయినాబాద్ పరిసరాల్లో రైతులకు సంబంధించిన కూరగాయలు, పూల మార్కెట్లు తదితర వాణిజ్య కార్యకలాపాలు అజీజ్‌నగర్ వైపు అభివృద్ధి చెందే అవకాశం ఉందని, దీంతో ఈ ప్రాంతం హైదరాబాద్‌కు మరింత అనుసంధానమవుతుందని వారు చెబుతున్నారు.మొయినాబాద్ మండల ప్రజలు, కక్షిదారుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని పాత పద్ధతిలోనే రాజేంద్రనగర్ కోర్టు పరిధిలో కేసుల విచారణ కొనసాగించాలని ప్రభుత్వానికి, న్యాయశాఖ అధికారులకు వారు విజ్ఞప్తి చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఎలుగని అశోక్ గౌడ్ ఎలుగని లోకేష్ గౌడ్, పాశం బాలరాజ్, సోమ రమేష్ యాదవ్, చాకలి హరి వార్డులోని మహిళలు తదితరులు పాల్గొన్నారు

# అక్రమ ఎర్రరాయి తవ్వకాలను అరికట్టే అధికారులు లేరా

### యథేచ్ఛగా కొనసాగుతున్న తవ్వకాలు.. ప్రభుత్వ ఆదాయానికి గండి



**పెద్దేముల్, అక్టోబర్ 08 (జనంసాక్షి):**పెద్దేముల్ మండలంలో అక్రమ ఎర్రరాయి తవ్వకాలు యదేచ్ఛగా కొనసాగుతున్నాయి. మండల పరిధిలోని పాషాపూర్, రాంసింగ్ తండా, అడికిచర్ల తదితర గ్రామాల పరిసర ప్రాంతాల్లో అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా ఎర్రరాయి తవ్వకాలు జరుపుతున్నారు. అనుమతులు, నిబంధనలకు విరుద్ధంగా కొందరు వ్యక్తులు భారీ యంత్రాలతో ఎర్రరాయిని తవ్వి తరలిచి సొమ్ము చేసుకుంటున్నారు. తవ్వకాల కారణంగా సహజ వనరులు దెబ్బతింటున్నా సంబంధిత అధికారులు పూర్తిస్థాయిలో స్పందించడం లేదని ఎక్కడ చూస్తే తెలుస్తుంది.పగలు, రాత్రి అనే తేడా లేకుండా యంత్రాలను వినియోగిస్తూ ఎర్రరాయిని తవ్వుతున్నరు.తవ్విన రాయిని వాహనాల్లో కర్ణాటక ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. ఈ వ్యవహారంపై అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలన లోపం ఉన్నట్లు స్పష్టంగా కనబడుతుంది. అనుమతులు లేకుండా నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు, రవాణా జరుగుతున్నట్లయితే ప్రభుత్వానికి రావాల్సిన ఆదాయానికి నష్టం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు. మైనింగ్, రెవెన్యూ తదితర సంబంధిత శాఖల అధికారులు సంయుక్తంగా తనిఖీలు నిర్వహించి, తవ్వకాలకు అనుమతులు ఉన్నాయా? లీజు నిబంధనలు పాటిస్తున్నారా? రవాణాకు అవసరమైన అనుమతులు ఉన్నాయా? అనే అంశాలను పరిశీలించాడాం లో అధికారులు విఫలమయ్యారు. ఈ అక్రమంగా



తవ్వకాలు ఇలాగే కొనసాగితే భవిష్యత్తులో పర్యావరణంపై తీవ్ర ప్రభావం పడే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొండలు, భూములు, సహజ వనరులను ఇష్టారాజ్యంగా తవ్వడం వల్ల భూస్వరూపం మారడంతో పాటు వర్షపు నీటి ప్రవాహం, భూగర్భ జలాలపై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని వారు చెబుతున్నారు. తవ్వకాల ప్రాంతాల్లో భద్రతా చర్యలు లేకపోవడం వల్ల ప్రమాదాల ముప్పు కూడా ఉంటుందని గ్రామస్థులు పేర్కొంటున్నారు. అక్రమ ఎర్రరాయి తవ్వకాల విషయాన్ని గతంలో పలుమార్లు సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ పూర్తిస్థాయిలో నియంత్రణ చర్యలు కనిపించడంలేదు. అధికారులు తవ్వకాల ప్రాంతాలను గుర్తించి సమగ్రంగా విచారణ అక్రమ ఎర్రరాయి గనులను తవ్వకాలకు పాల్పడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ప్రజలు చెబుతున్నారు. పాషాపూర్, రాంసింగ్ తండా, అడికిచర్ల పరిసర ప్రాంతాల్లో జరుగుతున్నట్లు ఎర్రరాయి తవ్వకాలపై సంబంధిత అధికారులు తక్షణమే క్షేత్రస్థాయిలో తనిఖీలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. తవ్వకాలు జరుగుతున్న ప్రాంతాలను పరిశీలించి, అనుమతులు ఉన్నాయా? లేదా? అన్నది స్పష్టం చేయాలని, నిబంధనలకు విరుద్ధంగా తవ్వకాలు జరుగుతున్నట్లు తేలితే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.అధికారులు స్పందించాలి.ప్రభుత్వ భూములు, సహజ వనరులకు నష్టం జరుగుతున్నా అధికారులు ఎందుకు స్పందించడం లేదు? అక్రమ తవ్వకాలను అడ్డుకునే అధికారులు లేరా?” అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత శాఖల ఉన్నతాధికారులు ఈ అంశంపై ప్రత్యేక దృష్టి సారించి సమగ్ర విచారణ చేపట్టాలని, అక్రమ తవ్వకాలు నిజమని తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. అక్రమ ఎర్రరాయి తవ్వకాలపై అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారో వేచి చూడాల్సి ఉంది.

# రికవరీ సరే.. బాధ్యత మాటేమిటి?

- రూ.54 లక్షల రికవరీ.. రూ.31 లక్షల దుర్వినియోగంపై విచారణ
- మిషనరీలు లేకుండానే బిల్లుల డ్రా.. రాజకీయ జోక్యంపై ప్రశ్నలు
- ఉద్యోగికి శిక్ష.. రాజకీయ నాయకుడికి రికవరీతోనే ముగింపా?
- ప్రజాధనానికి లెక్క చెప్పాల్సిందే.. తప్పు ఎవరిదైనా చర్య తప్పదా?

ప్రభుత్వ ఉద్యోగి అంటే కేవలం జీతం తీసుకునే వ్యక్తి కాదు.. ప్రజాధనంతో నడిచే ప్రభుత్వ వ్యవస్థకు బాధ్యతాయుతమైన ప్రతినిధి. విధుల్లో చిన్న తప్పిదం జరిగినా శాఖాపరమైన విచారణ, చర్యలు, సస్పెన్షన్ వంటి పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. నిధుల వినియోగంలో నిర్లక్ష్యం లేదా నిబంధనల ఉల్లంఘన జరిగితే బాధ్యత వహించాల్సిందే. మరి ప్రజల ఓట్లతో అధికారంలోకి వచ్చిన రాజకీయ నాయకుడి విషయంలోనూ ఇదే ప్రమాణం ఉండాలన్న ప్రశ్న ఇప్పుడు యాలాల సహకార సంఘం వ్యవహారంతో ముందుకొస్తోంది.






**యాలాల, అక్టోబర్ 8 (జనంసాక్షి)**

**రూ.54 లక్షల రికవరీ.. రూ.31 లక్షలపై విచారణ**

యాలాల మండలంలోని సహకార సంఘానికి చెందిన రైస్‌మిల్లులో మిషనరీ కొనుగోలు వ్యవహారం గత కొన్ని నెలలుగా చర్చనీయాంశంగా మారింది. ఈ వ్యవహారంలో రూ.54 లక్షల రికవరీకి ఆదేశాలు వచ్చినట్లు, సుమారు రూ.31 లక్షల దుర్వినియోగానికి సంబంధించి విచారణ కొనసాగుతున్నట్లు ఇప్పటికే వెల్లడైంది. మిషనరీలు ఏర్పాటు చేయకుండానే బిల్లులు ఎలా డ్రా చేశారన్న ప్రశ్నలు కూడా తలెత్తాయి. విచారణ తుది దశకు చేరుతున్న నేపథ్యంలో నిధుల వినియోగంలో ఎవరి పాత్ర ఎంత? నిర్ణయాలు ఎవరు తీసుకున్నారు? బాధ్యత ఎవరిది? అన్న అంశాలు స్పష్టంగా తేలాల్సి ఉంది.

**రాజకీయ జోక్యముంటే బాధ్యత ఎవరిది?**

విచారణ కమిటీ ఎదుట చైర్మన్, సీఈఓలు రాజకీయ జోక్యానికి సంబంధించిన అంశాలను అంగీకరించినట్లు చెబుతున్న విషయాలు నిజమైతే, దీనిని కేవలం ఉద్యోగి పరిపాలనా తప్పిదంగా ముగించకూడదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. రాజకీయ నాయకుడి ప్రభావంతో ప్రభుత్వ ఉద్యోగి నిర్ణయం తీసుకున్నా, ప్రజాధనం నష్టపోతే బాధ్యత ఎవరు వహించాలన్నది విచారణలో తేలాలి. ఉద్యోగి తప్పు చేస్తే శాఖాపరమైన చర్యలు తప్పనప్పుడు, ఉద్యోగిని అడ్డం పెట్టుకుని నిర్ణయాలు తీసుకున్న రాజకీయ నాయకుడి పాత్ర కూడా విస్మరించరాదన్న ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి.

**గత నిధుల వినియోగంపై స్పష్టత అవసరం**

ప్రజాధనం తిరిగి రికవరీ చేయడం అవసరమే. అయితే రికవరీతోనే తప్పు చేసిన వ్యక్తిపై బాధ్యత ముగిసినట్లు కాదన్నదే ప్రధాన అంశం. తప్పు నిర్ధారణ అయితే హోదాతో సంబంధం లేకుండా వర్తించే నిబంధనల ప్రకారం చర్యలు ఉండాలి. ఉద్యోగి అయినా, సహకార సంఘం బాధ్యుడైనా, రాజకీయ నాయకుడైనా ప్రజాధనం విషయంలో జవాబుదారీతనం తప్పక ఉండాలి. మరో రూ.20 లక్షల మంజూరు అంశం కూడా ప్రస్తావనకు వస్తున్న నేపథ్యంలో గత నిధుల వినియోగంపై పూర్తి స్పష్టత, కొత్త నిధులపై పటిష్ఠ పర్యవేక్షణ అవసరం.






**చర్య తీసుకోవాల్సింది వ్యవస్థే..**

పత్రికలు శిక్షలు విధించవు.. తీర్పులు ఇవ్వవు.. విచారణ సంస్థల స్థానాన్ని భర్తీ చేయవు. అందుబాటులో ఉన్న వాస్తవాలు, పత్రాల ఆధారంగా ప్రజలకు తెలియని అంశాలను వెలుగులోకి తేవడం, వ్యవస్థలోని లోపాలపై ప్రశ్నలు లేవనెత్తడం వాటి బాధ్యత. యాలాల సహకార సంఘం వ్యవహారంలోనూ ప్రజలు కోరేది ఎవరికైనా శిక్ష విధించాలని కాదు. విచారణ పారదర్శకంగా సాగి, ఎవరి బాధ్యత ఎంత ఉందో తేలాలి. తప్పు నిర్ధారణ అయితే హోదాతో సంబంధం లేకుండా చట్ట ప్రకారం చర్యలు ఉండాలి. ఉద్యోగికి ఒక న్యాయం, రాజకీయ నాయకుడికి మరో న్యాయం అన్న భావన ప్రజల్లో ఏర్పడకుండా వ్యవస్థ పనిచేయాలి. ప్రజాధనం ఎవరి వ్యక్తిగత ఆస్తి కాదు. పదవి పెరిగే కొద్దీ బాధ్యత, అధికారం పెరిగే కొద్దీ జవాబుదారీతనం కూడా పెరగాల్సిందే.



## జనంసాక్షి కథనాలతో కదిలిన పోలీసులు..

# చందానగర్ పరిధి లాడ్జిల్లో ముమ్మర తనిఖీలు

**శేరిలింగంపల్లి అక్టోబర్ 8 (జనంసాక్షి) :** జనంసాక్షి వార్త కథనానికి పోలీసు అధికారుల నుండి మంచి స్పందన లభించింది. శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలోని లాడ్జిలు, హోటల్స్‌లో ఈ మధ్యకాలంలో చోటు చేసుకుంటున్న సంఘటనలు, హత్యలు, మైనర్ అమ్మాయిల ప్రవేశాలను కూటంకిస్తూ సెప్టెంబర్ 26వ తేదీన 'పుట్టగొడుగుల అక్రమ హోటల్స్', ఈ నెల 7న 'శేరిలింగంపల్లిలో అక్రమ వ్యభిచారానికి నయా భాష్యం' అనే ప్రధాన శీర్షికలతో విశ్లేషణాత్మక కథనాలను అందించిన దరిమిలా సైబరాబాద్ పరిధి పోలీస్ అధికారులు హోటల్స్ పై చర్యలకు నడుం బిగించారు. ఈ నేపథ్యంలో గురువారం రాత్రి 10 గంటల సమయంలో చందానగర్ స్టేషన్ హౌస్ అధికారి పర్యవేక్షణలో పలువురు పోలీసు అధికారులు, సిబ్బంది చందానగర్ పరిధి హోటల్స్, లాడ్జిలను తనిఖీ చేయడం జరిగింది. ఇందులో భాగంగా ఆయా హోటళ్ల వివరాలు, చెక్ -ఇన్, చెక్-అవుట్ నమోదు సహా హోటళ్లలో బస చేస్తున్న వారి వివరాలను సైతం అడిగి తెలుసుకోవడం గమనార్హం. ఈ సందర్భంగా ప్రతిరోజు తమ తనిఖీలు ఇలాగే కొనసాగుతాయని, హోటల్, లాడ్జిల యజమానులు నిక్కచ్చిగా నిబంధనలను పాటించి తీరాల్సిందేనని వారికి స్పష్టం చేసినట్లు తెలుస్తోంది.











## జనవిజ్ఞాన వేదిక మహాసభలను విజయవంతం చేయండి

### రాష్ట్ర కోశాధికారి పిట్టల నాగరాజు

### అక్టోబర్ 10, 11న రాష్ట్ర 6వ మహాసభలు



**హైదరాబాద్ అక్టోబర్ 08 (జనంసాక్షి) :** జనవిజ్ఞాన వేదిక తెలంగాణ 6వ రాష్ట్ర మహాసభలను విజయవంతం చేయాలని రాష్ట్ర కోశాధికారి పిట్టల నాగరాజు పిలుపునిచ్చారు. అక్టోబర్ 10, 11 తేదీల్లో కొండాపూర్‌లోని సీసీఆర్‌టీ ప్రాంగణంలో మహాసభలు నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని 33 జిల్లాల నుంచి 400 మందికి పైగా ప్రతినిధులు హాజరుకానున్నారని చెప్పారు. గత నాలుగేళ్ల కార్యక్రమాలపై సమీక్షతో పాటు భవిష్యత్ కార్యాచరణపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు, యువతలో శాస్త్రీయ ఆలోచన, ప్రశ్నించే తత్వాన్ని పెంపొందించడం, మూఢనమ్మకాలపై చైతన్యం, పర్యావరణ పరిరక్షణ, ప్రభుత్వ విద్యను కాపాడుకోవడం, శాస్త్రీయ విద్యా విధానం, లౌకిక-ప్రజాస్వామ్య-సమానత్వ విలువల పరిరక్షణ వంటి అంశాలపై చర్చించనున్నట్లు తెలిపారు. మహాసభల అనంతరం నూతన రాష్ట్ర కమిటీని ఎన్నుకోనున్నట్లు వెల్లడించారు. 38 ఏళ్లుగా సైన్స్ ప్రచార ఉద్యమాన్ని కొనసాగిస్తున్న జనవిజ్ఞాన వేదికకు ప్రజల మద్దతు అవసరమన్నారు. ఉపాధ్యాయులు, అధ్యాపకులు, విద్యార్థులు, అన్ని వర్గాల ప్రజలు మహాసభల్లో పాల్గొని విజయవంతం చేయాలని నాగరాజు కోరారు.